

లడ్డూ తయారీ వంటశాలను ప్రారంభిస్తున్న ఈవో



లడ్డూ ప్రసాదంపోటు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలను పురస్కరించుకుని నూతన లడ్డూ ప్రసాదం పోటు తయారీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈవో శీనానాయక్ కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలతో వంటశాలను ప్రారంభించారు. ఆలయ స్థానాచార్యుడు వి.శివప్రసాద్‌శర్మ, అర్చక బృందం ఈ ప్రత్యేక పూజలు నిర్వహించింది. భవానీ భక్తులకు నాణ్యమైన, రుచికరమైన లడ్డూ ప్రసాదాన్ని అందించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. భవానీ దీక్షల విరమణ సమయంలో లక్షలాదిగా వచ్చే భక్తులకు నిరంతరం ప్రసాదం పంపిణీ చేయడానికి వీలుగా లడ్డూ ప్రసాదం పోటు తయారీ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

దుర్గమ్మ కానుకల లెక్కింపు

» 26 రోజులకు రూ.5.22కోట్ల ఆదాయం



6

దిగుబడిపై దిగాలు

ఈ ఏడాది దిగుబడులపై అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. మొంథా, దిత్వా తుఫాన్ల ప్రభావంతో దిగుబడులు భారీగా తగ్గుతున్నాయి. గత ఏడాది ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చిన పొలాల్లో ఈ ఏడాది 35 బస్తాలు రావడం కష్టంగా మారింది. ఎక్కువ శాతం చేలలో 30 బస్తాలతోనే రైతులు సరిపెట్టుకుంటున్నారు. సాగు ఖర్చులు పెరిగినా, ఆశించిన మేర దిగుబడులు రాక, ధాన్యానికి మద్దతు ధర లభించక రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వరిపై మొంథా, దిత్వా తుఫాన్ల ప్రభావం

భారీగా తగ్గిన దిగుబడులు ● గత ఏడాది ఎకరాకు 40 బస్తాలు

ఈ ఏడాది 35 బస్తాలు కూడా కష్టమే

- ధరను తగ్గించి అడుగుతున్న వ్యాపారులు, మిల్లర్లు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది వరి దిగుబడిపై మొంథా, దిత్వా తుఫాన్లు తీవ్ర ప్రభావం చూపాయి. వరి ఈత దశలో ఉండగా, వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలు, బలమైన గాలుల కారణంగా కొన్నిచోట్ల కంకులు పాలు పోసుకోలేదు. వాయుగుండం నుంచి బయటపడ్డామని రైతులు ఊపిరి పీల్చుకునేలోపే మొంథా తుపాను ప్రభావంతో బలమైన గాలులు వీచాయి. దీంతో మళ్లీ పలు ప్రాంతాల్లో కంకులు సుంకురాలి గింజలు పగిలి పాలుపోసుకోలేదు. పంట కూడా నేలవాలిపోవడంతో దిగుబడులు తగ్గిపోయాయి. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, మచిలీపట్నం, చల్లపల్లి, పెడన, తదితర ప్రాంతాల్లో గత ఏడాది ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చిందని, ఈ ఏడాది 30 బస్తాల దిగుబడికి మించి రావడం కష్టమవుతోందని రైతులు అంటున్నారు. బీపీటీ-5204 రకం గతంలో 25 నుంచి 30 బస్తాల దిగుబడి రాగా, ఈ ఏడాది 22 బస్తాలకు మించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం బస్తాలు



బస్తా ధాన్యం రూ. 1,500కే అడుగుతున్నారు

వరి కోతలు ప్రారంభమైన రోజుల్లో ధాన్యంలో తేమశాతం 22 పాయింట్లు ఉన్నా బస్తా ధాన్యం రూ.1,550 వరకు ధర చెల్లించారు. నాలుగైదు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో ధాన్యంలో తేమశాతం 20 పాయింట్లకు తగ్గినా- రైతు సేవా కేంద్రాలకు వెళితే రూ.1,500కు మించి ధర రాదని చెబుతున్నారు. గతంలో తేమశాతం 22 పాయింట్లు ఉన్నా బస్తాకు రూ.1,550 ధర ఇచ్చారని, ఇప్పుడు తేమశాతం 20 పాయింట్లు ఉన్నా ధర ఎందుకు తగ్గిస్తున్నారని రైతులు ప్రశ్నిస్తుంటే, మీకేమైనా అనుమానాలు ఉంటే మిల్లర్లతో నేరుగా మాట్లాడుకోవాలని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది చెప్పి తప్పించుకుంటున్నారు. కొందరు రైతులు ధాన్యంలో తేమశాతం 16 నుంచి 17 పాయింట్లు వచ్చే వరకు ఆరబెట్టి శాంపిళ్లను తీసుకెళ్తే ధాన్యంలో నూకశాతం అధికంగా ఉందని, ఈ ధాన్యం మేం కొనుగోలు చేయలేమని మిల్లర్లు చెబుతున్నారు. తేమశాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్నా, ధాన్యంలో నాణ్యత లేదని, నూకశాతం అధికంగా ఉందని మిల్లర్లు తమను ఆందోళనకు గురి చేస్తున్నారని, దీంతో మిల్లులకు పంపిన ధాన్యం తిరిగి వేరే మిల్లుకు విక్రయించలేక, రవాణా చార్జీలు భరించలేక మిల్లర్లు నిర్ధారించిన ధరకు ధాన్యం తెగనమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

2.46 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

జిల్లాలో 287 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 29,668 మంది రైతుల నుంచి 2.46 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ ఎం.నవీన్ ఆదివారం ప్రకటించారు. గత ఏడాది డిసెంబరు 7 నాటికి జిల్లాలో 1.82 లక్షల టన్నుల ధాన్యం కొన్నామని తెలిపారు. ఈ ఏడాది రైతులు ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలో రూ.502.50 కోట్లను రైతుల బ్యాంకు మిగతా 6లో..

పెరిగిన తప్ప, తాలు శాతం

వరి కంకులు పాలు పోసుకునే దశలో తుఫాన్లు రావడంతో కంకులు పూర్తిస్థాయిలో పాలుపోసుకోలేదు. దీంతో వరి కంకుల్లో తప్ప, తాలుశాతం పెరిగింది. వర్షాలు కురవడంతో కంకులు రెండు, మూడు రోజుల పాటు తడిచి ఉండటంతో మానుగాయ సోకింది. మానుగాయ సోకిన గింజలు బూజుపట్టి పరిపక్వత చెందలేదు. వర్షం కారణంగా పంట నేలవాలి మొలకెత్తడంతో దిగుబడి ఎకరాకు ఎనిమిది నుంచి పది బస్తాలకు తగ్గిందని రైతులు చెబుతున్నారు.

నిరుపయోగంగా మారిన కొత్త ఆనకట్ట



మళ్లీ మొదటికి.. పోలంపల్లి!

పాత ఆనకట్ట మరమ్మతులకు మరోసారి ప్రతిపాదనలు

- » కౌలు చెల్లిస్తేనే గండ్లు పూడ్చేందుకు అనుమతిస్తాం : తెలంగాణ రైతులు
- » తక్షణం నీరందకుంటే వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి
- » ఆందోళనలో ఆయకట్టు రైతులు
- » రేపు సమావేశం కానున్న ప్రాజెక్టు కమిటీ, రైతులు

6

టెట్‌కు ఏర్పాట్లు

రేపటి నుంచి 21వ తేదీ వరకు..

» అధికారులతో కలెక్టర్ సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు. కానూరు ఆయాన్ డిజిటల్ జోన్, పెడన సమీపంలోని నందమూరులో వాసవీ ఇంజనీరింగ్ కళాశాల, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా సరిపడా బస్సులను నడపాలన్నారు. స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు, నెట్ సౌకర్యానికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ కె.విద్యాసాగర్ నాయుడు, డీఈవో పీవీజే రామారావు, డీఎంఅండ్‌హెచ్‌వో యుగంధర్, ప్రజా రవాణాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ఏ1 రైల్వేస్టేషన్‌ను ప్రధాన రూట్లకు దూరం చేయాలని రైల్వేబోర్డు ఆలోచన చేస్తుందా? ఈ ఆలోచన బెజవాడ ప్రజలకు ముఖ్యమైన రైల్వేరూట్లను దూరం చేస్తుందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. రైల్వే అధికారులు తాజాగా వేస్తున్న అడుగులు ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి.

సెపరేట్ చేస్తున్నారా?

విజయవాడ రైల్వేస్టేషన్ 'ఐసోలేట్' దిశగా అడుగులు

కమర్షియల్‌గా ఉపయోగించుకునే పన్నాగమేనా?

- » ఇప్పటికే చాలా రైళ్లు రాయనపాడు వరకు మార్పు
- » ప్రధాన రూట్లను కూడా మళ్లించే ప్రణాళికలు

- » తాజా రైల్వే ఆలోచనలతో అనుమానాలకు బలం
- » రైల్వేస్టేషన్ అభివృద్ధి అమృత్ భారత్‌కు కాకుండా ప్రైవేట్‌కు..
- » విజయవాడ మీదుగా ప్రధాన రూట్ల క్రమబద్ధీకరణ
- » సమాంతరంగా రాయనపాడు, గుణదల స్టేషన్ల అభివృద్ధి
- » అమరావతి, మచిలీపట్నం-రేపల్లె లైన్లు అందులో భాగమేనా?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్‌ను క్రమేణా కమర్షియల్ హబ్‌గా మార్చేసి ఆదాయాన్ని ఆర్జించాలన్నది రైల్వేబోర్డు ఆలోచనగా ఉంది. రద్దీ స్టేషన్లలో ఒకటైన ఈ రైల్వేస్టేషన్‌ను ముఖ్యరూట్ల నుంచి ఐసోలేట్ చేస్తేనే తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే విజయవాడ ప్రధాన రైల్వేస్టేషన్ అతిముఖ్యమైన రూట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా బెజవాడ రైల్వేస్టేషన్, పరిసర స్థలాలను కమర్షియల్‌గా సద్వినియోగం చేసుకునే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది.

శాటిలైట్ రైల్వేస్టేషన్లలో కొన్నింటికి హాల్టింగ్

విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ తగ్గించడానికి వీలుగా ఇప్పటికే 30 రైళ్లు శాటిలైట్ రైల్వేస్టేషన్ రాయనపాడులో ఆపేస్తున్నారు. భవిష్యత్తులో మరో 30 రైళ్లు ఆపేందుకు గుణదలను కూడా శాటిలైట్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు.

ప్లాట్‌ఫాంల కుదింపు ఎందుకో..

దేశవ్యాప్తంగా చాలా రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ కింద రైల్వేశాఖ అభివృద్ధి చేస్తోంది. మన రాష్ట్రంలో కూడా ఒక్క విజయవాడ తప్ప అన్ని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. విజయవాడను మాత్రం ప్రైవేట్ డెవలపర్లతో అభివృద్ధి చేయించాలని నిర్ణయించారు. అయితే, ఈ అభివృద్ధి ప్రాజెక్టులో పలు మార్పులు చేశారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్‌లో 10 ప్లాట్‌ఫాంలు మిగతా 6లో..

ఆందోళన చేస్తున్న భవానీలకు సర్దిచెబుతున్న పోలీసులు



భవానీల నిరసన

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

- » పరిమితికి మించి వెళ్తున్న ఆటోను ఆపిన కానిస్టేబుల్
- » స్క్యూబ్రిడ్జి వద్ద గొడవ.. చేయిచేసుకున్న కానిస్టేబుల్
- » క్షమాపణ చెప్పాలంటూ బైఠాయించిన భవానీలు
- » రంగంలోకి దిగి సర్దిచెప్పిన పోలీసు ఉన్నతాధికారులు
- » కానిస్టేబుల్‌పై చర్యలకు హామీ ఇవ్వడంతో విరమణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : 'డౌన్.. డౌన్.. పోలీస్' అంటూ భవానీ మాలధారులు నిరసన వ్యక్తం చేశారు. మాలలో ఉన్న తమపై విచక్షణ కోల్పోయి దాడి చేసిన కానిస్టేబుల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వివరాల్లోకి వెళితే.. భజన నిమిత్తం 16 మంది భవానీలు కంకిపాడు నుంచి తాడేపల్లి బయల్దేరారు. పరిమితికి మించి ప్రయాణిస్తున్న ఆటోను మార్గంమధ్యలో తాడిగడప 100 అడుగుల రోడ్డు వద్ద కానిస్టేబుల్ ఆపారు. ఆ సమయంలోనే భవానీలకు, కానిస్టేబుల్‌కు మధ్య మాటామాటా పెరిగి గొడవ జరిగింది. అయితే, మరోసారి అదే కానిస్టేబుల్ ఆటోను సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆపి ఫొటో తీసి పంపించేశారు. ఇదే మిగతా 6లో..

అక్రమార్కుల బరితెగింపు

మడచెట్ల నరికివేత నుంచి తప్పించుకునే కుట్రలు

- » తనిఖీ బృందాలు రాకుండా డొంకరోడ్లకు గండ్లు
- » ఎన్‌జీటీకి ఫిర్యాదు చేయాలనుకుంటున్న పర్యావరణ ప్రేమికులు
- » అయినా పెదపట్నంలో ఇష్టానుసారంగా చెట్ల నరికివేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మడ అడవులను ఇష్టానుసారంగా నరికేస్తున్న అక్రమార్కులు మరిన్ని దారుణాలకు తెగబడుతున్నారు. చెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాల పరిశీలనకు వచ్చే తనిఖీ బృందాలను అడ్డుకోవటానికి రోడ్లకు గండ్లు కొడుతున్నారు. కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం మండలం పెదపట్నంలో మడచెట్ల నరికివేతకు పాల్పడుతున్న మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరైనా తనిఖీలకు వస్తారేమోనని ఈ పని చేస్తున్నారు.



పెదపట్నం-పార్వతీపురం మార్గంలో డొంకరోడ్డుకు గండి

డొంకరోడ్లకు గండ్లు

పెదపట్నం నుంచి పార్వతీపురం వెళ్లే మార్గం వెంబడి లోపలి వైపు మడచెట్ల నరికివేత కొనసాగుతూనే ఉంది. ప్రధాన మార్గానికి అనుసంధానంగా డొంక రోడ్లు ఉంటాయి. ఈ డొంక రోడ్ల మీదుగా ముందుకువెళ్తే మడచెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాలు కనిపిస్తాయి. డొంకరోడ్ల మీదుగా వెళ్తే బండారం బయటపడుతుందన్న ఉద్దేశంతో అక్రమార్కులు తెలివిగా ఒక్కొక్కటిగా మిగతా 6లో..

భవానీ దీక్షల విరమణకు సర్వం సిద్ధం

ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

6

ఇకపై ఆన్‌లైన్‌లో భక్తులకు పూజా టికెట్లు

మోపిదేవి సుబ్బారాయుడి ఆలయ ఈవో వెల్లడి



దుర్గగుడిలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

దుర్గమ్మ కానుకల లెక్కింపు

» 26 రోజులకు రూ.5.22కోట్ల ఆదాయం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం ఈవో వీకే శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పర్యవేక్షణలో మహామండపం 6వ అంతస్తులో లెక్కించారు. 26 రోజులకు వచ్చిన కానుకలను లెక్కించగా రూ.5,22,18,647లు ఆదాయం సమకూరినట్లు ఈవో, చైర్మన్‌లు తెలిపారు. 415 గ్రాముల బంగారు ఆభరణాలు, 7కేజీల 465 గ్రాముల వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ 489 యుఎస్ఏ డాలర్లు, 109 సింగపూర్ డాలర్లు, 125 కెనడా డాలర్లు, 860 యూఏఈ దీర్హమ్స్, 125 సౌదీ రియాల్స్, 4 మలేషియా రింగెట్స్, 105 ఆస్ట్రేలియా డాలర్లు, 10 ఇంగ్లండ్ పౌండ్లు, 10 స్టెర్లింగ్ పౌండ్లు, 20 మాల్దీవుల రుఫియా, 1 బెహరాన్ దీనార్స్ 20 యూరప్ యూరోలు భక్తులు అమ్మవారికి సమర్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఏఈవోలు, ఉద్యోగులు, ఎస్.పి.ఎఫ్ వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, పలు సేవా బృందాలు, తదితరులు పాల్గొన్నారు.



ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలసి భవానీ దీక్షల విరమణల ఏర్పాట్లపై తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో కావూరి చైతన్య

భవానీ దీక్ష విరమణలకు సర్వం సిద్ధం

» ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లను రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కావూరి చైతన్య సోమవారం ఈవో శీనానాయక్‌తో కలసి తనిఖీ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆటో క్యాడ్ ప్లాన్‌లను పరిశీలించి, భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఇరుముడులు సమర్పించేందుకు భక్తుల కోసం ఏర్పాటు చేయు హోమ గుండాల ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదం అందించే ప్రదేశాన్ని, వసతులను తనిఖీ చేశారు. భవానీ దీక్షల విరమణకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టారు.

ఇకపై ఆన్‌లైన్‌లో భక్తులకు పూజా టికెట్లు

మోపిదేవి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం దేవదాయశాఖ ఆధ్వర్యంలో వివిధ పూజా రుసుములు, టిక్కెట్ బుకింగ్ ఆన్‌లైన్ సౌకర్యం కల్పించినట్లు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల పరిధిలోని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి దేవస్థానం, శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణు దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ప్రత్యక్ష-పరోక్ష సేవలు, ప్రసాదం, విరాళం అన్నీ ఇప్పుడు ఏపీ టెంపుల్స్.ఏపీ.జీవోవీ.ఇన్ లేదా మనమిత్ర వాట్సాప్ 9552300009 ద్వారా వెంటనే బుక్‌చేసుకునే సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వసనీయ విధానాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగపర్చుకోవాలన్నారు.

కోగంటి బాబుకు మరో పదవి..

» వ్యమా. చైర్మన్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నిక



కంచికచర్లరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కంచికచర్లయార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ (బాబు) ఏకగ్రీవంగా ఎన్నుకయ్యారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమిస్తూ, కష్టకాలంలో విజయం కోసం పనిచేసిన కోగంటి బాబుకు మరో పదవి వచ్చి చేరింది. ఇప్పటికే కంచికచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా, పరిటాల ఎంపీటీసీగా, కంచికచర్ల జడ్పీటీసీగా, దశాబ్దకాలంగా మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా కోగంటి మాట్లాడుతూ, మార్కెట్ యార్డ్ కమిటీల చైర్మన్‌లకు గ్రేడుల వారీగా తగిన సౌకర్యాలు, ఆర్థిక భరోసా, కల్పించే విధంగా తీర్మానాలు చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీల అభివృద్ధిపై త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. కోగంటి బాబును కంచికచర్ల, వీరులపాడు మండల నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు.



గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద ఆవుల కళేబరాలతో వెళుతున్న వాహనాన్ని అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ శ్రేణులు

ఆవుల కళేబరాల వాహనాన్ని అడ్డుకున్న విశ్వహిందూ పరిషత్ శ్రేణులు

విద్యాధరపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి తరలిస్తున్న ఆవుల కళేబరాల లోడు వాహనాన్ని విశ్వహిందూ పరిషత్‌శ్రేణులు అడ్డుకున్న సంఘటన సోమవారం గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద జరిగింది. వారు ఆ వాహనాన్ని భవానీపురం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వివరాల మేరకు గుంటూరు జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రం కోదాడకు మినీ వాహనంలో ఆవుల కళేబరాలు తరలిస్తున్నారని సమాచారం విజయవాడలోని పలువురు విశ్వహిందూ శ్రేణులకు తెలిసింది. దీంతో వారు గొల్లపూడి వన్‌సెంటర్ వద్దకు వెళ్లి ఆ వాహనాన్ని ఆపి అందులో ఉన్న డ్రైవర్, ఇద్దరు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భవానీపురం పోలీసులకు సమాచారం తెలియపరిచారు. పోలీసులు వాహనం డ్రైవర్, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కళేబరాలు లోడు ఉన్న వాహనం దుర్వాసన వ్యాప్తిచెందటంతో ఆ వాహనాన్ని గొల్లపూడి అట్కిన్‌సన్‌రోడ్డులో నిలిపివేశారు. సిఐ ఉమామహేశ్వరరావు వాహనంలో ఉన్న రికార్డులు, బిల్లులను పరిశీలించి కళేబరాలు తరలించవచ్చా లేదా అనే దానిపై సంబంధిత విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మళ్లీ మొదటికి.. పోలంపల్లి!



గండ్లు పూడ్చాల్సిన పాత ఆనకట్ట

» పాత ఆనకట్ట మరమ్మతులకు మరోసారి ప్రతిపాదనలు

» కౌలు చెల్లిస్తేనే గండ్లు పూడ్చేందుకు అనుమతిస్తాం : తెలంగాణ రైతులు

» తక్షణం నీరందకుంటే వేలఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి

» ఆందోళనలో ఆయకట్టు రైతులు

» రేపు సమావేశం కానున్న ప్రాజెక్టు కమిటీ, రైతులు

పోలంపల్లి ప్రాజెక్టు పరిధిలో అన్నదాతల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారినా తమ రాత మారడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పోలంపల్లి డ్యాం సమస్యను ప్రస్తావిస్తూ ఓట్లు దండుకుంటున్న నేతలు.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదనే విమర్శ అన్నదాతల నుంచి వ్యక్తమౌతోంది. ప్రాజెక్టు సమగ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వానికి ఇప్పటికి రెండుసార్లు ప్రతిపాదనలు పంపినా ఎలాంటి నిధులు మంజూరుకాలేదు. దీంతో ఆయకట్టులోని సుమారు 25 వేల ఎకరాల రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

పెనుగంచిప్రోలు రూరల్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి) :

గండ్లు పూడ్చాలంటే తెలంగాణ రైతులకు కౌలు చెల్లించాలి

ప్రాజెక్టు దగ్గర గతంలో భారీ వరదల తాకిడికి తెలంగాణ వైపు రైతుల భూములు కోతకు గురయ్యాయి. 2004లో చేపట్టిన కొత్త డ్యామ్ నిర్మాణం వల్లే తమ భూములు కోతకు గురవుతున్నాయని స్థానిక రైతులు మూడేళ్ల క్రితం పాత ఆనకట్టకు గండ్లు పెట్టారు. దీంతో కాలువకు మళ్లాల్సిన సాగునీరు వృధాగా పోతుండటంతో అప్పటి ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ప్రభుత్వ అధికారులు అక్కడి రైతులతో చర్చించి సుమారు రూ.70 లక్షల వరకు కౌలు నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత ఆ భూములను ఏపీ ప్రభుత్వం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించిన దస్త్రాలు ఇరు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నడుస్తున్నాయి. ఈలోగా గతేడాది కౌలు చెల్లించాలని తెలంగాణ రైతులు డిమాండ్ చేస్తూ గండ్లు పూడ్చనీయటం లేదు.

రూ. 22 కోట్లకు ప్రతిపాదనలు

పాత ఆనకట్టను పటిష్టం చేయటంతో పాటు, తెలంగాణ రైతులకు చెందిన43 ఎకరాల కొనుగోలు కలిపి ఇటీవల రూ. 22 కోట్లతో అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఉన్నతాధికారులు ఆనకట్టను పరిశీలించి రూ.42 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. రెండుసార్లు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు.

తక్షణావసరాలకు రూ. 10 లక్షలు అత్యవసరం

రైతులకు కౌలు రూపంలో రూ.5 లక్షలు, గండ్లు పూడ్చేందుకు సుమారుగా మరో రూ.5 లక్షలు మొత్తంగా రూ.10 లక్షలు అవసరం కానున్నాయి. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి మంజూరు కాకపోవటంతో ప్రాజెక్టు కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రస్తుతం ఆయకట్టులో సుమారు 10వేల ఎకరాల్లో మిర్చి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగులో ఉన్నాయి. కొన్నిచోట్ల రబీ వరిసాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలువలో సాగునీరు పారాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం నిధుల సమస్య ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యను పైస్థాయికి తీసుకుపోయేందుకు బుధవారం జగ్గయ్యపేటలో ఆయకట్టు రైతులతో కలిసి ప్రాజెక్టు కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించనుంది.

తక్షణం గండ్లు పూడ్చకుంటే పంటలు ఎండిపోతాయి

- పాస్నం బాలాజీ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్

రబీలో ఆయకట్టులో వాణిజ్య పంటలైన మిర్చి, పసుపు, మొక్కజొన్న, వరి, ఇతర పంటలు సాగులో ఉన్నాయి. తక్షణం గండ్లు పూడ్చి కాలువకు సాగునీరు మళ్లించాల్సి ఉంది. నిధుల లభ్యత లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.



పులిచింతల డ్యామ్

పులిచింతల నీరు విడుదల సాధ్యం కాదు!

» ఇతర నీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది

» కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్

నందిగామ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం ఎత్తిపోతల పథకాలకు పులిచింతల నుంచి నీటిని విడుదల చేయడం సాధ్యం కాదని కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు నీరు విడుదలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలకు జలవనరులశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ ఆర్ రవికిరణ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పులిచింతలలో నీటి నిల్వ, విడుదల అంశం తమ పరిధిలోనిది కాదని స్పష్టం చేశారు. నదిలో నీటి కేటాయింపు కృష్ణా నది నిర్వహణ బోర్డు(కెఆర్ఎంబి) ఆదేశాల మేరకు కృష్ణా నీటి వివాదాల ట్రిబునల్(కెడబ్ల్యూడీటి) తీర్పుల ప్రకారం జరుగుతుందని చెప్పారు. నీటి నిర్వహణ పూర్తిగా శాస్త్రీయంగా, చట్టబద్ధ ఆదేశాలతో జరుగుతుందని తెలిపారు. డెల్టా సాగు, తాగునీటి అవసరాలు ఉన్నపుడు, వరద నీరు చేరినపుడు మాత్రమే పులిచింతల నుంచి నీటిని విడుదల చేస్తామని తెలిపారు. మిగులు నీరు, వరద ప్రవాహాలు వచ్చినప్పుడు మాత్రమే ఎత్తిపోతల పథకాలకు నీటిని వినియోగించుకొనే అవకాశం ఉందని చెప్పారు. రుతుపవనాలు ముగిసినందున ప్రస్తుతం పులిచింతలలో నిల్వ ఉంచిన నీరు ఎంతో విలువైనవన్నారు. డెల్టాలోని ఖరీఫ్ సాగుతో పాటు వేసవి నీటి అవసరాలకు ఈనీటిని వినియోగించాల్సి ఉందని చెప్పారు. వేసవిలో ఆరు జిల్లాలకు చెందిన వందలాది గ్రామాలకు తాగునీరు ఈ ప్రాజెక్ట్ నుంచి అందించాల్సి ఉందని తెలిపారు. విజయవాడ, అమరావతి, గుంటూరు వంటి నగరాల నీటి అవసరాలకు కూడా ఈ నీటిని వినియోగించాల్సి ఉందని చెప్పారు. గోదావరి నదిలో నీటి మట్టం కనీసం 14 మీటర్లు ఉంటేనే పట్టిసీమ నుంచి నీటిని తెచ్చుకొనే అవకాశం ఉందని చెప్పారు. కానీ ప్రస్తుతం ఆ మేర నీరు లేదని చెప్పారు. అందువల్లనే పులిచింతల నుంచి నీటిని విడుదల చేయడం లేదని ఆయన తెలిపారు. కృష్ణా సెంట్రల్ బోర్డు చట్ట పరిధిలో తమ విధులు నిర్వహిస్తుందని ఆయన చెప్పారు.

భవానీల నిరసన

(5వ పేజీ తరువాయి)

సమాచారాన్ని సదరు కానిస్టేబుల్.. పటమట పోలీస్ స్టేషన్‌లోని మరో కానిస్టేబుల్‌కు చేరవేశారు. పటమట పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఆటోను బెంజిసర్కిల్ వద్ద ఆపి విచారణ చేశారు. ఈ సందర్భంలోనూ భవానీలకు, కానిస్టేబుల్‌కు వివాదం జరిగింది. కొద్దిసేపటి తరువాత ఆటోలో బయల్దేరిన భవానీలను కానిస్టేబుల్ వెంబడించి స్క్యూబ్రిడ్జి వద్ద నిలుపుదల చేశారు.

రోడ్డుపై బైఠాయించిన భవానీలు

స్క్యూబ్రిడ్జి వద్ద ఆటోను ఆపిన కానిస్టేబుల్‌కు, భవానీ మాలాధారులకు మళ్లీ గొడవ అయ్యింది. భవానీ మాలధారణలో ఉన్న ఓ హిజ్రాపై కానిస్టేబుల్ చేయిచేసుకున్నాడు. చేతిపై బలంగా కొట్టడంతో తోటి భవానీ మాలధారులు కానిస్టేబుల్‌పై తిరగబడ్డారు. దీంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే భవానీలంతా హైవేపై నినాదాలు చేశారు. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని బైఠాయించారు. ఈ ఆందోళనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అటు కనకదుర్గమ్మ వారధి వరకు, ఇటు రామవరప్పాడు రింగ్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల వరకు ఆందోళన కొనసాగింది. కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకునే వరకు కదిలేదని భవానీలు పట్టుబడటంతో ఏసీపీ దామోదర్ ఘటనాస్థలానికి చేరుకుని భవానీలతో మాట్లాడారు. వివాదానికి కారణమైన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళనను విరమించారు.

వివాదంపై విచారణ

భవానీ మాలాధారులకు, పోలీస్ కానిస్టేబుల్‌కు జరిగిన వివాదంపై విచారణ వేగవంతం చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పరిమితికి మించిన ప్రయాణికులతో ప్రమాదకరంగా వెళ్తున్న భవానీ మాలాధారుల ఆటోను కానిస్టేబుల్ ఆపి, వారికి జాగ్రత్తలు చెప్పినట్లు పేర్కొన్నారు. భవానీలు సహనం కోల్పోయి కానిస్టేబుల్‌పై వాగ్వాదానికి దిగడమే కాకుండా అతని బైక్‌ను కింద పడేశారని, ఫోన్‌ను లాక్కుని నేలకేసి కొట్టారని, మరో కానిస్టేబుల్‌పై దాడి చేశారని ఆయన తెలిపారు. ఈ వివాదంపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని, సీసీ పుటేజీలను సేకరిస్తున్నామని తెలిపారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

బరితెగింపు

(5వ పేజీ తరువాయి)

గండ్లు కొట్టాలని నిర్ణయించారు. ముందుగా మొదటి డొంకరోడ్డుకు గండి కొట్టే పని ప్రారంభించారు. తనిఖీ బృందాల వాహనాలను అడ్డుకోవటానికి వీలుగా గండ్లు కొడుతున్నారని సమీప ప్రాంతాల ప్రజలు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. అయినా కూడా అధికారులు పట్టించుకోవట్లేదు. తూర్పు కృష్ణాలో మడచెట్ల నరికివేత పెడన, బంటుమిల్లి మండలాలతో పాటు పెదపట్నం వరకు పాకింది. దీంతో గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాలని కొంతమంది పర్యావరణ ప్రేమికులు సిద్ధమవుతున్నారు. గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్తే తనిఖీ బృందాలు వస్తాయన్న ఉద్దేశంతో అక్రమార్కులు డొంకరోడ్లకు గండ్లు కొట్టించే పనులు చేస్తున్నారు.

స్పందించరేం..!

పెదపట్నంలో మడచెట్ల నరికివేత, రొయ్యల చెరువుల తవ్వకాలకు సంబంధించి జిల్లా యంత్రాంగం స్పందించకపోవటం అనుమానాలకు తావిస్తోంది. అటవీ, రెవెన్యూ శాఖలు తమది కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. పీడబ్ల్యూడీ భూముల్లోని మడచెట్లను నరికివేస్తున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదు. లజ్జబండ డ్రెయిన్ వెంబడి ఉన్న చెట్లను కూడా నరికి రొయ్యల చెరువులు సాగు చేస్తున్నా జలవనరుల శాఖ అధికారులు అటువైపు చూడట్లేదు. దీంతో మడచెట్ల సంరక్షణ కోసం కొంతమంది ప్రకృతి ప్రేమికులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించాలని భావిస్తున్నారు.

దిగుబడిపై దిగాలు

(5వ పేజీ తరువాయి)

ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం త్వరితగతిన కొనేందుకు జిల్లాలో 72.98 లక్షల గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు 4,199 వాహనాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కంకులు సిద్ధమైన తర్వాతే వరి కోతలు కోయాలని, ధాన్యం పూర్తిస్థాయిలో ఆరబెట్టి, మద్దతు ధరకు విక్రయించుకోవాలని జేసీ రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే మండల, డివిజన్ స్థాయి రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అలాగే, కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన 82476 93551 కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి సమస్యను చెప్పవచ్చని ఆయన సూచించారు.

సెపరేట్ చేస్తున్నారా?

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిని 12 చేయాలని గతంలో ప్రతిపాదించారు. కానీ, 10నే కొనసాగిస్తున్నారు. ఈ నిర్ణయం వెనుక విజయవాడ రైల్వేస్టేషన్‌ను ఐసోలేట్ (ఒంటరిని) చేయాలన్న ఉద్దేశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే కమర్షియల్‌గా అభివృద్ధి చేయాల్సిన ప్రదేశాన్ని మూడొంతులు పెంచారు. దీనినిబట్టి విజయవాడలో రూ.వేలకోట్ల విలువైన రైల్వే ఆస్తుల ద్వారా ఆదాయాన్ని సాధించాలన్నది రైల్వేబోర్డు ఆలోచన.

అమరావతి రైల్వేలైన్ అలైన్‌మెంట్ ఇందులో భాగమేనా?

రాజధాని అమరావతికి రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి రైల్వేబోర్డు ఎంచుకున్న అలైన్‌మెంట్ మొదట్లో ఎవరికీ అర్థం కాలేదు. విజయవాడ నుంచి కృష్ణా కెనాల్ జంక్షన్ మీదుగా మంగళగిరి, ఉండవల్లి, అమరావతికి వెళ్లే అవకాశం ఉన్నా.. ఖమ్మంజిల్లా ఎర్రుపాలెం నుంచి పరిటాల మీదుగా అమరావతికి , తిరిగి అమరావతి నుంచి నంబూరుకు నూతన రైల్వేలైన్ ప్రతిపాదించారు. ఈ అలైన్‌మెంట్ వెనుక విజయవాడను ఐసోలేట్ చేయాలన్న ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ-విజయవాడ-చెన్నై మధ్య రాకపోకలు సాగించే రైళ్లు కొండపల్లి మీదుగా విజయవాడ వస్తున్నాయి. రానున్న రోజుల్లో ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు, అటు నుంచి చెన్నైకు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఢిల్లీ రైళ్లు విజయవాడను టచ్‌చేసే పరిస్థితి తగ్గుతుంది. అమరావతి నూతన రైల్వేలైన్ ఏర్పడితే కచ్చితంగా ఢిల్లీ-చెన్నై రైళ్లను అమరావతి మీదుగానే నడపాల్సి ఉంటుంది. ఇవేకాకుండా విజయవాడ మీదుగా వెళ్లే ఇతర జోన్లకు సంబంధించి పాసింగ్ త్రూ రైళ్లు కూడా విజయవాడకు రాకుండానే వెళ్లే అవకాశముంది.

కోల్‌కతా రైళ్లు సైతం రాయనపాడు మీదుగానే..

సికింద్రాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లే రైళ్లు ప్రస్తుతం విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. భవిష్యత్తులో ఇవన్నీ రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ మీదుగా (అమరావతి రైల్వేలైన్ మీదుగా) వెళ్తాయని సమాచారం. దీంతో ఈ మార్గంలో నడిచే చాలా రైళ్లు విజయవాడను టచ్‌చేసే పరిస్థితి ఉండకపోవచ్చు. ఇదే జరిగితే అతి ముఖ్యమైన రెండో రూట్‌ను కూడా విజయవాడ రైల్వేస్టేషన్ కోల్పోయే ప్రమాదం ఉంది. విజయవాడకు వచ్చే రైళ్లలో సగభాగం కోల్‌కతా-చెన్నై మధ్య రాకపోకలు సాగించేవే. ఢిల్లీ, చెన్నై వయా విజయవాడ రూట్, సికింద్రాబాద్-చెన్నై వయా విజయవాడ రూట్‌ల తర్వాత మూడో స్థానంలో ఉన్న కోల్‌కతా-చెన్నై వయా విజయవాడ రైళ్లకు ఇప్పటికిప్పుడు విజయవాడ మీదుగా వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. ఈ రూట్‌ను కూడా త్వరలో మళ్లించే అవకాశం ఉంది. నరసాపురం మీదుగా మచిలీపట్నం-రేపల్లె, రేపల్లె-బాపట్ల రైల్వేలైన్లకు సంబంధించి ప్రస్తుతం క్షేత్రస్థాయిలో సర్వే జరుగుతోంది. డీపీఆర్ రూపకల్పన చేస్తే భవిష్యత్తులో నూతన రైల్వేలైన్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అప్పుడు కోల్‌కతా-చెన్నై రైళ్లను మళ్లించే అవకాశం ఉంది. అలాగే, సికింద్రాబాద్-విశాఖపట్నం, సికింద్రాబాద్-భువనేశ్వర్ రైళ్లు కూడా రాయనపాడులోనే ఆగే అవకాశాలు ఉన్నాయి.

మావోయిస్టులను కలవడానికి అనుమతివ్వండి

» కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మానవ హక్కుల సంఘు న్యాయవాదులు

విజయవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో పోలీసులకు చిక్కి జైలులో ఉన్న మావోయిస్టులను కలవడానికి అనుమతి ఇవ్వాలని మానవ హక్కుల సంఘు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 18న పెనమలూరు పోలీసులు 28 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిలో 24 మంది రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్నారు. వారిని కలవడానికి అనుమతి ఇవ్వాలని మానవ హక్కుల సంఘు న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, వేముల రవీంద్రనాథ్, సతీష్, ఏఎస్ఎస్ రాంప్రసాద్, గంగాభవానీ, ఆంజనేయులు విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

8 కెఎల్‌వి-7-సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

జిల్లా ధరల నియంత్రణ కమిటీ సమావేశం

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను సమీక్షించారు. సదరు సమావేశంలో గత సంవత్సరంతో పోల్చుకొంటే ఈ సంవత్సరం ధరలు నియంత్రణలో ఉన్నాయని, కూరగాయల దిగుమతులు ఎక్కువగా వున్నందువల్ల రానున్న కాలంలో కూడా కూరగాయలకు ఎటువంటి కొరత ఉండదని తెలియజేశారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ ఎ.పాపారావు, మార్కెటింగ్ ఏడీ, అగ్రికల్చర్ ఏడీ, రైస్ మిల్లర్స్ ప్రెసిడెంట్, జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్, దాల్స్, ఆయిల్స్ హోల్సేల్, రిటైలర్స్ ఇతర సభ్యులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా

నివాసాల చెంతన మురుగు, పిచ్చిచెట్లు!

» ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పిచ్చికాడ

» స్క్రబ్ టైఫస్ కీటకాల విజృంభణ వేళ ప్రజల భయాందోళన

» గ్రామంలో పంచాయతీ, ఆరోగ్యశాఖ చర్యలు శూన్యం

తోట్లవల్లూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ కీటకంపై ప్రజల్లో భయాందోళన నడుస్తోంది. ఈ కీటకం కుడితే ప్రాణాలకు ప్రమాదమని వార్తలు రావటం, దీనికి పరిసరాల అపరిశుభ్రత కారణమంటున్నారు. దీనికితోడు తోట్లవల్లూరు మండలం పక్కనే ఉన్న ఉయ్యూరు మండలం ముదునూరులో స్క్రబ్ టైఫస్‌తో ఒకరు మృతిచెందినట్టు వెల్లడికావటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పిచ్చిమొక్కలు, కాడ, గడ్డి, పొదలపై ఈ కీటకం ఉంటుందని, దీనికితోడు గ్రామాల్లో పరిస్థితులు అధ్వానంగా తయారయ్యాయి. నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు అపరిశుభ్రత మధ్య ఉండటం అధికారుల చర్యలు ఎలా ఉన్నాయో తెలియజేస్తోంది. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, ప్రాథమిక పాఠశాల, జడ్పీ హైస్కూల్ వద్ద పిచ్చిమొక్కలు, కాడ, అపరిశుభ్రత వాతావరణం కళ్లకు కడుతోంది. తోట్లవల్లూరు నార్త్ దళితవాడలో నివాస గృహాల మధ్య ఖాళీ ప్రదేశంలో వర్షాల మురుగు పేరుకుపోయి పిచ్చిచెట్లు పెరిగి ప్రమాదకర కీటకాలకు నిలయంగా మారుతోంది. ప్రజల్లో ఉన్న భయాల దృష్ట్యా గ్రామ పంచాచతీలు, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా పారిశుద్ధ్య చర్యలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం నెలకొంది. మురుగు నీటిని బయటకు తోడించటం, పిచ్చిపొదలు, కాడను తొలగించటం, కీటకాల నియంత్రణకు మందు పిచికారి చేయటం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



హౌసింగ్ కార్యాలయం చుట్టూ పిచ్చికాడ

తోట్లవల్లూరు నార్త్ దళితవాడలో ఇళ్ల మధ్య మురుగు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

అయ్యప్పస్వామి దేవాలయానికి రూ.50,116 విరాళం



హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు శివాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న అయ్యప్పస్వామి దేవాలయానికి సోమవారం స్థానిక శ్రవంతి చారిబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ రూ. 50,116లు విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులు గూడ పాటి రత్నశేఖర్, కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, కొల్లి వెంకట్రావు, వీర మాచనేని నాగయ్య, రాంబాబు దాతను అభినందించారు.



చెరుకు లోడింగ్ వద్ద పూజ నిర్వహిస్తున్న కే సీపీ డీజీఎం(కేన్) వెంకటేశ్వర్లు

చెరుకు లోడింగ్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుకు వివిధ రకాల ప్రోత్సాహ కాలనందిస్తూ చెరుకు సాగు విస్తీర్ణం పెంపొందించేలా చర్య లు చేపట్టినట్లు సద్వినియోగం చేసుకుని మరింత ఎక్కువగా చెరుకు సాగు చేయాలని కేసీపీ డిప్యూటీ జనరల్ మేనేజర్ జీ.వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్.ఎన్.పాలెంలో జాతీయ రహదారి పక్కన చెరు కు లోడింగ్ పాయింట్ వద్ద సోమవారం రైతులతో కలిసి పూజ చేసి లోడింగ్‌ను ప్రారంభించారు. బాపులపాడు మండలం నుంచి 76 వేల మెట్రిక్ టన్నుల చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ మేనేజర్ వి.కాశినాయుడు వివరించారు.

బాలోత్సవ్‌కు మానవత విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో నిర్వహించనున్న హేలాపురి బాలోత్సవ్ కార్యక్రమానికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సభ్యులు రూ.46,500లు విరాళం అందజేశారు. సోమవారం మానవత కార్యాలయంలో బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావుకు విరాళం అందజేశారు. ఈ నెల 12 నుంచి 14వరకు ఏలూరులో జరగనున్న బాలోత్సవానికి విరాళం అందజేశారు. మారుబోయిన కోటేశ్వరరావు రూ.30వేలు, మానత సభ్యులు ఘంటా సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, లలితాకామేశ్వరి, కూరెళ్ల సుబ్బాచారి, నారగాని కొండలరావు జి. జయరామచంద్రరావు తదితరులు కలిపి మరో రూ.16,500లు విరాళం అందజేసినట్లు మానవత జంక్షన్ శాఖ అధ్యక్షుడు బాణాల నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో రత్నాకరరావు, సత్యనారాయణ, సుబ్బారావు, సూర్యనారాయణ, శ్రీరామ్‌మూర్తి, కొండలరావు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న జంపాన, సభ్యులు

అవినీతిపై విచారణ జరిపించాలి

ఉయ్యూరు చైర్మన్, కమిషనర్‌పై మంత్రి నారాయణకు వినతి

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మున్సిపాలిటీలో చైర్మన్, కమిషనర్ అవినీతిపై విజిలెన్స్ విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ మంత్రి పి. నారాయణకు వినతిపత్రం సమర్పించినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. యుఎఫ్ ఆర్‌టీఐ సభ్యుల బృందం సోమవారం మంత్రిని సచివాలయంలో కలసి మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అవినీతిపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మున్సి పాలిటీలో మోటార్లు వైండింగ్ నిమిత్తం మరమ్మతులు చేయకుండానే లక్షల రూపాయలు ఖర్చు చేసినట్టు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయ డానికి, బ్లీచింగ్ నిమిత్తం లక్షల రూపాయలు, తాగునీరు శుభ్రపరిచేం దుకు అవసరమైన లిక్విడ్ క్లోరినేషన్ చేయకుండా బిల్లులు పెట్టి పెద్దయెత్తున అవినీతికి పాల్పడి ప్రజాధనం దిగమింగారని ఆరోపిస్తూ చైర్మన్, కమిషనర్ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరులో వాటర్ పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ల నిర్వహణ చేపట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు ఎస్సీ కాలనీలో తాగునీరు కలుషితం అయినట్టు సమాచారం మేర సోమవారం గ్రామంలో పర్యటించి పైపులైన్ డమ్మీలు తొలగింప చేయించి నీటిని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ, తాగునీరు సరఫరాపై శ్రద్ధ వహించాలన్నారు. సర్పంచ్ లింగాల భాస్కర్, కోయ ఆనందప్రసాద్, ధనకోటేశ్వరరావు పాల్గొన్నారు.

● పెనమలూరులో ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, రికార్డులు తనిఖీచేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కోయ ఆనందప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు ఎమ్మెల్యేతో ఉన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఉంగుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యువత వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా వుంటూ ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నారయ్యఅప్పారావుపేట సర్పంచ్ నాగరాజు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వారంరోజులపాటు నిర్వహించే ప్రత్యేక సేవా శిబిరం ఈ సంవత్సరం పొట్టిపాడు శివారు నారయ్య అప్పారావుపేటలో సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు శిబిరంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు యువత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్నిపెంపొందించేలా చేయూతనివ్వడం అభినందనీయమని ఏపీఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ అన్నారు. పెరికీడుకు చెందిన మానసిక దివ్యాంగురాలు దయాన కుటుంబానికి రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అందజేసిన నిత్యా వసరా లను ఆయన సోమవారం పంపిణీ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగురాలి కుటుంబానికి తన వంతు సహకారంగా నెలకు సరిపడా నిత్యావసరాలు(రూ.10 వేలు విలువ గల) అందజేసినట్లు సాంబశివరాయల్ వివరించారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు ప్రవీణ్, అంబల్ల వెంకటరంగారావు, సింగవరపు దుర్గారావు, బట్టు రత్న పాల్గొన్నారు.

60 మందికి నేత్రపరీక్షలు

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు టూవీలర్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించి 60 మందికి నేత్ర పరీక్షలు చేశారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అక్బర్‌బాషా పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో ఆప్తమాలజిస్ట్ ఏ.రాకేశ్ నేత్ర పరీక్షలు చేశారు. యూనియన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో సాధారణ దృష్టి పరీక్షలు చేసి నేత్ర సంరక్షణ అంశంపై సూచనలు సలహాలు అందించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.నాగరాజు, అధ్యక్షుడు ఎం. జగన్నాథం, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, సెక్రటరీ అబ్దుల్ ఇబ్రహీం, కోశాధికారి కొల్లా వేణు, ప్రచార కార్యదర్శి ఎం. విజయ్ పాల్గొని సేవలందించారు.

వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవం

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కోడె సాంబశివరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడుగా టి. చంటిబాబు, కార్యదర్శి గోకా శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఖలీల్ ఎన్నికైనారు. అసోసియేషన్‌కు రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సాంబశివరావుకు డాక్టర్ తిరుమలరావు, రాంబాబు, రమణ, అంగడాల బుజ్జి, రాము తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

గన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి బాలాజీ డిమాండ్ చేశారు. ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్(జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ ఎదుట సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్. రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి గుండపనేని కృష్ణవేణి, కన్వీనర్ సజ్జ నాగబాబు, నండూరి శ్రీనివాస రావు ఉద్యోగులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించి డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉయ్యూరు కేడీసీసీ బ్యాంకు బ్రాంచి పరిధి సంఘాల ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. **ఉంగుటూరు :** మండలంలోని 11 సహకార సంఘాల (పీఏసీఎస్‌లు) ఉద్యోగులు సోమవారం కేడీసీసీ బ్యాంక్ తేలప్రోలు, ఉంగుటూరు బ్రాంచ్‌ల ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపు మేరకు కృష్ణాజిల్లా సహకార సంఘాల యూనియన్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ఉద్యోగులు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ కేడీసీసీ బ్రాంచ్‌ల ఎదుట నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు షేక్ కాలీషా, గర్రే లోకేశ్వరరావు సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్‌రూరల్:** దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సహకార సంఘ ఉద్యోగుల చేపట్టిన ఆందోళన కార్యక్రమం ఉధృతం చేశారు. బాపుల పాడు మండల వ్యాప్తంగా గల పీఏసీఎస్ ఉద్యోగులు జిల్లా కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కేడీసీసీ బ్యాంకు హనుమాన్‌జంక్షన్ శాఖ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా గల పీఏసీఎస్ ఉద్యోగులు, ఆర్గనైజర్ వడ్డి సుమన్, వివిధ సంఘాల కార్యదర్శులు రాము, చలపతి, రామారావు, శ్రీనివాసరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

కంకిపాడు : సొసైటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కో ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కంకిపాడు సొసైటీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ బ్యాంక్ మేనే జర్ సీ.హెచ్ జాహ్నవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దీక్షతులు, ప్రవీణ్, ఎ. వెంకటప్పారెడ్డి, జితేంద్ర, పి. ఇందిర, వై. శ్యామల, యామిని పాల్గొన్నారు.



జంక్షన్ కేడీసీసీ బ్యాంకు బ్రాంచి వద్ద ఉద్యోగుల నిరసన



కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

కేసరపల్లి పంచాయతీకి ఐఎస్‌వో గుర్తింపు

గన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి పంచాయతీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. గ్రామపంచాయతీ నిర్వహణ, కాఫీ షాప్ ఏర్పాటుపై ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను మంజూరు చేయగా సోమవారం కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వీఎల్ ప్రసాద్ అందుకున్నారు. పంచాయితీకి ఆదా యాన్ని మరింత పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, హెచ్‌సీఎల్ సమీపంలో రూ.7లక్షలతో పంచాయతీకి ఆదాయం చేకూరేలా కాఫీ షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెలకు సుమారు రూ.50 వేలు వరకూ ఆదాయం వస్తుందన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో ఒత్తిడి తగ్గించి శ్రద్ధగా చదువుకునేలా ఆరోగ్యాన్ని కాపాడేందుకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందిస్తున్నా మని, దాతలు సహకరించడం అభినందనీయమని హెచ్‌ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అల్పాహారాన్ని యనమదల సుధాకర్ సోమవారం హెచ్‌ఎంకు అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు.



శ్రీప్రతిభ కోచింగ్ సెంటర్ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల, చిత్రంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి

చంద్రబాబు అంటేనే డీఎస్సీ

● శ్రీప్రతిభ కోచింగ్ సెంటరు విజయోత్సవ సభలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ

పెనమలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్షలాది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలకు కారణమైన డీఎస్సీ అంటే చంద్రబాబు అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. శ్రీప్రతిభ నుంచి రికార్డు స్థాయిలో 358మంది విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా ఆదివారం కానూరు శ్రీప్రతిభ కోచింగ్ సెంటరులో ఏర్పాటు చేసిన డీఎస్సీ విజయోత్సవ సభలో కొనకళ్ల మాట్లాడారు. ఇటీవలి ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యారంగం పట్ల తమకున్న ప్రత్యేక బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చెప్పకనే చెప్పారని కొనియాడారు. కోచింగ్ సెంటర్ అధినేత జంపాన సుధాకర్ మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధ విద్యాబోధన, పటిష్టమైన షెడ్యూల్, అనుభవం గల ఉపాధ్యాయుల బోధన వల్లే అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రతియేటా డీఎస్సీని ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రికార్డు స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు సాధింపజేసిన శ్రీప్రతిభ కోచింగ్ సెంటరు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, గొట్టిముక్కల రఘురామరాజు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, డైరెక్టర్ శౌంఠి శివరాంప్రసాద్, కుడిపూడి సత్తిబాబు, మల్లెల ఈశ్వరరావు, ఏఎస్ రామారావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, పేరేపి ఈశ్వర్, ఏ మణి పాల్గొన్నారు.

గ్రామాల్లో సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యం, విద్య, అన్నవితరణ లాంటి సేవలతో పాటు పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటి సేవలందించడం అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు అన్నారు. హనుమాన్ జంక్షన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 2024-25 సేవలకు గాను సేవాపుర స్కారాలను మాజీగవర్నర్ గద్దె శేషగిరి ఆదివారం సాయంత్రం అందజేశారు. విజయవాడలోని అన్నేవారి కల్యాణ మండపంలో నిర్వహించిన స్పందన పురస్కారాల వేడుకలో హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ సభ్యులను పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ, అక్కినేని శ్రీనివాసఫణీంద్ర, కళ్లేపల్లి నారాయణరావు, తమిరి రమేష్, పంచకర్ల రమేష్‌చక్రవర్తి, కోశాధికారి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓ ఉయ్యూరు యూనిట్ ఎన్నికలు 23న

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీఓ ఉయ్యూరు తాలూకా యూనిట్ కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి కేపీ రావు తెలిపారు. 10 తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక ఏపీఎన్‌జీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా జి.రాజేంద్ర, అబ్జర్వర్‌గా కేవీ కోటేశ్వరరావు వ్యవహరిం చనున్నారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఎన్నికల్లో పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ నవీన్, డీఆర్వో చంద్రశేఖరావు, ఆర్డీవో స్వాతి, డీసీ శ్రీదేవి

ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందించండి

● ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం/మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం) ద్వారా ప్రజలిచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం జేసీ ఎం నవీన్, ఇతర శాఖల అధికారులతో కలిసి ఆయన ప్రజలనుంచి 201 అర్జీలను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 284 అర్జీలను అధికారులు ఇంకా చూడలేదని, ఇది మంచిపద్ధతి కాదన్నారు. 128 అర్జీలు గడువుమీరి ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు జీతాలు పొందేందుకు స్టేట్‌బ్యాంక్ అఫ్ ఇండియాలో తప్పనిసరిగా ఖాతా ఉండేలా చూసుకోవాలన్నారు. స్త్రీలు, పురుషుల సమానత్వంపై డీఆర్‌డీఏ అధికారులు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలు గుర్రపుడెక్కతో తయారుచేసిన బుట్టలను కలెక్టర్ ఆవిష్కరించారు. డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో కే స్వాతి, కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ శివప్రసాద్, పౌరసరఫరాలసంస్థ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, డీఎస్‌వో శోభన్‌బాబు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గూడూరు మండలం రాయవరం గ్రామంలో డొంక రోడ్లను ఆక్రమిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన రైతు ఎం వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణలతో వందెకరాల వరికోతలకు వెళ్లే ట్రాక్టర్లకు ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే తన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని గుడివాడ మండలం బొమ్ములూరు మండలానికి చెందిన రైతు అట్లూరి శేషగిరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి తన భూమిని ఇవ్వాలని ఆయన కోరారు.



వినతిపత్రాలు స్వీకరించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తాం: ఎస్పీ

బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అదనపు కట్నం కోసం తన భర్త రెండేళ్లుగా వేధిస్తున్నాడంటూ పెనమలూరుకు చెందిన కవిత ఫిర్యాదు చేసింది. అలాగే తనకున్న ఇద్దరు కుమారులు వృద్ధాప్య దశలో భోజనం పెట్టకుండా వేధిస్తున్నారని, ఆస్తి కోసం చంపాలని చూస్తున్నారని పెడన నుంచి వచ్చిన నర్సమ్మ ఫిర్యాదు చేసింది. సరిహద్దు దారుడు తన స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నారని తోట్లవల్లూరుకు చెందిన వీరయ్య ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల వయసున్న తన బిడ్డను అత్తింటి వారు తమ వద్దే ఉంచుకుని తనను కలవనివ్వడం లేదని అవనిగడ్డ నుంచి వచ్చిన వనజ అనే వివాహిత ఫిర్యాదు చేసింది. బార్యాభర్తల మధ్య ఉన్న వివాదమే కారణమని పేర్కొంది.



ఐఎస్‌వో పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ

ఆరు పంచాయతీలకు ఐఎస్‌వో అవార్డులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్‌లో తమ సమర్థతను చూపించి సంపాదన చేకూర్చిన ఆరు పంచాయతీలకు ఐఎస్‌వో అవార్డులను కలెక్టర్ డీకే బాలాజీ అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లో డీపీవో అరుణతో పాటు చల్లపల్లి పంచాయతీ ఈవో పీవీ మాధవేంద్రరావు, కేసరపల్లి పంచాయతీ ఈవో సీవీఎస్ఎల్ ఆర్‌వీ ప్రసాద్, బాపులపాడు పంచాయతీ ఈవో పరమేశ్వరి, ఆత్కూరు పంచాయతీ ఈవో పీ సురేష్‌కుమార్, పునాదిపాడు పంచాయతీ ఈవో బీ వెంకటేశ్వరరావు, నాగాయలంక పంచాయతీ ఈవో పవన్‌కుమార్‌కు అవార్డులు అందజేశారు. జేసీ నవీన్, డీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఖో-ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మడకా



గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుడివాడకు చెందిన అంతర్జాతీయ ఖో- ఖో రిఫరీ మడకా ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 7న ఏలూరులో రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మడకాను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, డాక్టర్ కేకే ఆర్స్ గౌతమ్ పాఠశాల డైరెక్టర్ కే అవినాష్, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్ అభినందించారు.

ఉద్యోగాలిప్పిస్తానని రూ.40లక్షలకు టోకరా



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని తమ వద్ద రూ.40లక్షలు గుంజేశాడని ముగ్గురు బాధితులు కలెక్టరేట్ వద్ద మీడియాకు మొరపెట్టుకున్నారు. ఈడేపల్లికి చెందిన ముగ్గురు బాధితులు కలెక్టర్ బాలాజీకి సోమవారం ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. డూండీ అనే వ్యక్తి ఉద్యోగాలిప్పిస్తానని, వ్యాపారాల్లో వాటాలు ఇస్తానని చెప్పి మోసం చేశాడన్నారు. అడిగితే దౌర్జన్యానికి దిగుతున్నారని వారు వాపోయారు.

నిర్వహణ కారణాలతో పలు ప్రత్యేక రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో పలు ప్రత్యేక రైళ్లను రద్దుచేసినట్టు విజయవాడ డివిజన్ పీఆర్వో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న నడవాల్సిన 07144 చర్లపల్లి - నర్సాపూర్, 07155 కాకినాడ టౌన్ - చర్లపల్లి ఈనెల 26న నడవాల్సిన 07145 నర్సాపూర్ - చర్లపల్లి, 07156 చర్లపల్లి - కాకినాడ టౌన్, 07157 హైదరాబాద్ - కాకినాడ టౌన్ ఈనెల 27న నడవాల్సిన 07158 కాకినాడ టౌన్ - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. ఇంతకుముందు ఈ ప్రత్యేక రైళ్లు ఒక్కో సర్వీసు చొప్పున నడుస్తాయని అధికారులు ప్రకటించారు. నిర్వహణ కారణాలతో రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.

చారిత్రకం.. వెల్దుర్తిపాడు బౌద్ధారామం

దేశంలోని 84వేల బౌద్ధ స్థూపాల్లో ఒకటి ● 177 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన బౌద్ధారామం
● కొండను అభివృద్ధి చేస్తే పెరగనున్న పర్యాటకం ● విలువైన సంపద ఉందని గతంలో తవ్వకాలు

ఆంధ్రజ్యోతి, పెనుగంచిప్రోలు రూరల్: జిల్లాలోని పెనుగంచిప్రోలు మండలం వెల్దుర్తిపాడు కొండపైనున్న బౌద్ధక్షేత్రం ఆధ్యాత్మికతకు ఆహ్లాదానికి ప్రతీకగా నిలుస్తోంది. కొండపైనున్న బౌద్ధారామం స్థూపాలు, పలు రకాల కట్టడాలు పర్యాటకులను ఎంతోగానో ఆకర్షిస్తున్నాయి. ఇటీవల యోగా, ధ్యానం చేసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్న నేపథ్యంలో ఈ కొండను అభివృద్ధి చేస్తే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా మారనుంది.





కొండపై ఉన్న బౌద్ధస్థూపాలు, కొండపైకి వెళ్లే మార్గం

కొండపై బుద్ధుడి అవశేషాలతో స్థూపం

గుమ్మడిదుర్రు పంచాయతీ పరిధిలోని వెల్దుర్తిపాడు గ్రామ సమీపంలో 177 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొండ విస్తరించి ఉంది. కొండపై సుమారు 8 ఎకరాల్లో పూర్తిగా బౌద్ధారామం నిర్మాణం చేశారు. దీన్ని క్రీస్తు పూర్వం 250లో కళింగ యుద్ధం ముగిసిన



వెల్దుర్తిపాడు కొండ

తర్వాత అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించి ఆ ధర్మాన్ని ప్రచారం చేయటంలో భాగంగా దేశవ్యాప్తంగా 84వేల బౌద్ధస్థూపాలు నిర్మించగా అందులో ఇదొకటని చరిత్రకారులు చెబుతున్నారు. బుద్ధుడి శిష్యులు స్థూపంలో బుద్ధుడి అవశేషాలతో పాటు విలువైన సంపదను దాచినట్టు చరిత్ర చెబుతోంది. ఆ ప్రచారంతోనే దుండగులు పలుమార్లు ఈ కొండపై రహస్యంగా తవ్వకాలు చేశారు. విలువైన శిల్పాలను కాపాడుకునేందుకు వాటిని పురావస్తుశాఖ వారు గుంటూరు జిల్లా అమరావతికి తరలించారు. బౌద్ధమత సన్యాసులు వెల్దుర్తిపాడు కొండతో పాటు, జగ్గయ్యపేట సమీపంలోని ధనంబోడుపై నివాసం ఏర్పాటు చేసుకొని ఈ ప్రాంతంలో బుద్ధుడి బోధనలు ప్రచారం చేశారు. అనంతరం కాలంలో కాకతీయ సేనలు, మొఘల్ సేనలకు విడిదిగా కూడా కొండను వినియోగించుకున్నారు.

అభివృద్ధి చేస్తే పర్యాటక శోభ

బౌద్ధారామం కొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి మరింత శోభను తెచ్చిపెడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పదేళ్లుగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో కొండపై మొక్కలు నాటడం, విత్తన బంతులు వెదజల్లటం వంటి కార్యక్రమాలు చేపడ్డంతో కొండపై పచ్చదనం పెరిగి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచుతోంది. ఒకపుడు బోడిగుండులా ఉండే కొండపై మొక్కలు పెరిగి పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రభుత్వం ఈ కొండకు మరిన్ని వనరులు సమకూర్చి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రుద్రరాజు చెరువు కింద వాగును ఆక్రమించి వరిపంట సాగు

● పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మైలవరం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లూరు శివారు దాసుళ్లపాలెం రుద్రరాజు చెరువు కింద వాగును కొంతమం ది రైతులు యథేచ్ఛగా ఆక్రమించి వరిసాగును చేపట్టారు. వందేళ్ల క్రితం పంటపొలాలకు సాగునీరు వెళ్లేందుకు వంద లింకుల వెడల్పుతో అధికారులు వాగును ఏర్పాటు చేశారు. ఈ వాగు కింద సుమారు వందెకరాల ఆయకట్టు ఉంది. ఇటీవల కొంతమంది రైతులు చెరువు కళింగు నుంచి వాగును పొలాల్లో కలిపి వేసుకొని వరిపంటను సాగు చేస్తున్నారు. దీంతో చివరి పొలాలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. వంద లింకుల విస్తీర్ణంలో ఉన్న వాగును అడుగుకు పరిమితం చేయడంతో చెరువు నీరు ప్రవహించే వీలు లేకుండా పోయింది. వాగును ఆక్రమించడంతో పొలంలోకి వెళ్లేందుకు దారి కూడా లేదని రైతు షేక్ హుస్సేన్ తెలిపారు. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న వాగును కొందరు కావాలనే అడ్డగోలుగా ఆక్రమించి మిగతా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయాడు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన వాగును పునరుద్ధరించడంతోపాటు దారిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



వాగులో సాగుచేసిన వరిపంట



స్క్రబ్ టైఫస్ వ్యాధిపై సూచనలు ఇస్తున్న స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీమ్

మెడికల్ టీమ్ పర్యటన

కంచికచర్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్క్రబ్‌టైఫస్ వెలుగు చూడటంతో స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీమ్ సోమవారం కంచికచర్లలో పర్యటించారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకి కంచికచర్ల ఇందిరా కాలనీకి చెందిన ఒక మహిళ విజయవాడలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ సందర్భంగా కంచికచర్ల గ్రామపంచాయతీ, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై ఈ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా స్క్రబ్ టైఫస్ వ్యాధిని నిర్ధారించి తగు సూచనలు సలహాలిచ్చేందుకు స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీంకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ నిహారిక పట్టణానికి విచ్చేసి సూచనలు సలహాలు అందజేశారు. స్టేట్ మెడికల్ కౌన్సిల్ టీం తో పాటు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర, ఎంపీడీవో డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల సునీత, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్ ఇండియా వాలీబాల్ పోటీలకు కేయూ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత వాలీబాల్ పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయం విద్యార్థి జీ మహేష్ బాబు ఎంపికయ్యాడు. కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న మహేష్‌బాబును సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ విజయకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు పరుచూరి గోపీ అభినందించారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి

● ప్రిఫరెన్షియల్ విధానంలో ఓటింగ్ పద్ధతి

విజయవాడ లీగల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సందడి ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగబోయే ఎన్నికలకు ఇప్పుడే కోలాహలం మొదలైంది. ఈ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులను రాష్ట్రంలోని 152 బార్ అసోసియేషన్‌లకు చెందిన న్యాయవాదులు ఎన్నుకోవాలి. ప్రిఫరెన్సియల్ ఓటింగ్ విధానం ద్వారా అభ్యర్థిని ఎన్నుకుంటారు. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 38 నుంచి 42వేల మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఓటు వేసే విధానం ఎలాగంటే పోలింగ్ అధికారి ఇచ్చిన పెన్నుతో ఇంగ్లీష (అక్షరాలలో)లో తప్పులు లేకుండా ప్రాధాన్యతా క్రమంలో వారి పేరు ఎదురుగా ఉన్న బాక్సులో నెంబరును రాయాల్సి ఉంటుంది. టిక్, రౌండప్, సంతకం, వేలిముద్ర, ఎక్స్ మార్క్, పేర్లు, గీతలు, చుక్కలు రాయొద్దు. బ్యాలెట్ పేపరుపై ఏమైనా రాసినట్లు గుర్తిస్తే ఓటును తిరస్కరిస్తారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ



వీరులపాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దొడ్డదేవరపాడు గ్రామంలోని బీసీ ఏరియాలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం అర్ధరాత్రి ఒక వ్యక్తి ప్రవేశించి స్వామి వారి హుండీని తస్కరించినట్టు పోలీసులు తెలిపారు. హుండీని పొలాల్లోకి తీసుకు వెళ్లి పగుల కొట్టి నగదును తీసుకొని పారిపోయాడు. పోలీసులు ఆలయానికి చేరుకొని సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై రెండు రోజుల రిలే దీక్షలు ప్రారంభం

ధర్నాచౌక్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు 2వ ఏఎన్ఎం యూనియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల రిలే దీక్షలు స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా వైద్య, ఆరోగ్యశాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఏఎన్ఎంలు సేవలందిస్తున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న వీరిని సుదూర ప్రాంతాలకు బదిలీలు చేయడం వల్ల ఆర్థికం గా, మానసికంగా మూడేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మా నవతాదృక్పథంతో వారి ప్రాంతాలకు తిరిగి పంపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యాప్‌ల భారం, ఒత్తిడి తగ్గించాలన్నారు. గతంలో మాదిరిగా యూనిఫాం, యూనిఫాం అలవెన్స్ చెల్లించాలని, జీవో 60 ప్రకారం రూ.27వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ చైర్మన్ డీ దయామణి, సీఐటీయూ నేత ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం స్వాతి, కే రవీనాజ్యోతి, కోశాధికారి ఎం నారాయణమ్మ పాల్గొన్నారు.

లారీలోని సిలిండర్ నుంచి గ్యాస్ లీక్

● లారీ నిండా నిండు బండలు ● భయాందోళనలో ప్రజలు, వాహన చోదకులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి ఎర్ర బిడ్జ్ కింద ఏపీహెచ్ఎమ్ఈఎల్ రోడ్డు సమీపంలో ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ 30వ జాతీయ రహదారి పక్కనే నిలిపి ఉన్న ఓ గ్యాస్ సిలిండర్ల లారీలో ఉన్న ఓ గ్యాస్ సిలిండర్ నుంచి సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో గ్యాస్ లీకయింది. కొండపల్లి ఐడీఏలోని ఇండేన్ గ్యాస్ కంపెనీ నుంచి గ్యాస్ సిలిండర్లను లోడు చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన లారీని డ్రైవర్ ఎన్‌హెచ్ పక్కన ఆపి భోజనం తెచ్చుకోవడానికి వెళ్లాడు. ఈ సమయంలో లారీలోని నిండు సిలిండర్లలోని ఒక సిలిండర్ భారీగా గ్యాస్ లీక్ కావడంతో సమీపంలోని గృహస్థులు, వాహన చోదకులు గుర్తించి విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో వారు అక్కడికి వచ్చి ఆ గ్యాస్ బండను కిందకు దింపి స్టేషన్‌కు తరలించారు.



లారీలోని సిలిండర్ నుంచి లీకవుతున్న గ్యాస్

హస్తకళలు, కళాకారులకు

ప్రభుత్వ ప్రోత్సాహం

● ఏపీహెచ్‌డీసీ చైర్మన్ హరిప్రసాద్

● 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ హస్తకళా వారోత్సవాలు



గాంధీనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హస్తకళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఇందులో భాగంగా ఈ నెల 8 నుంచి 14 వరకు జాతీయ హస్తకళా వారోత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ (ఏపీహెచ్‌డీసీ) చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని లేపాక్షి ఎంపోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న కడప జిల్లా గురుశిష్య హస్త్‌శిల్ప్ ప్రశిక్షణ్ ప్రోగ్రామ్ ద్వారా 30మంది ఇత్తడి, కంచులోహపు హస్తకళాకారులకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 12న పల్నాడు జిల్లా దుర్గిలో 30 మంది కళాకారులకు డిజైన్ అభివృద్ధి వర్క్‌షాప్, 13న తిరుపతి జిల్లా మాదవమాల, శ్రీకాళహస్తిలో కలపచెక్క కళాకారులకు 14న అనకాపల్లి జిల్లా కేడీ పేటలో 50 మంది, 15 నుంచి 21 వరకు రాజమహేంద్రవరంలో 40 మంది కళాకారులకు ఏడు రోజుల గాంధీ శిల్ప్ బజార్, 17న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 50 మంది శిల్ప కళాకారులకు టూల్‌కిట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 2023-24కు సంబంధించి హస్తకళా అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 9న న్యూఢిల్లీలో జరుగుతుందన్నారు. రాష్ట్రం నుంచి ముగ్గురు కళాకారులు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ప్రధానీ మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి ఎస్ సవిత, చేనేత హస్తకళల గౌరవ సలహాదారు సుచిత్రా ఎల్లా రాష్ట్రంలో హస్తకళాభివృద్ధికి, కళాకారుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నారన్నారు. కళాకారులకు అవసరమైన చెక్కను అందుబాటులో ఉంచేందుకు ఉడ్ బ్యాంకును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు చెప్పారు. సంస్థ వీసీ అండ్ ఎండీ ఎం విశ్వ, లేపాక్షి ఓఎస్‌డీ ఐవీ లక్ష్మీనాథ్, ఎంపోరియం మేనేజర్ ఎం సురేష్ పాల్గొన్నారు.

నేడు ఎస్ఎంవీటీ బెంగళూరు - విశాఖ ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అదనపు రద్దీని పరిష్కరించేందుకు ఈనెల 8, 9న ఎస్ఎంవీటీ బెంగళూరు - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నారు. 08501 నెంబరు గల రైలు విశాఖపట్నంలో సోమవారం మధ్యాహ్నం 3.20కు బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 12.45కు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మంగళవారం 3.50కు బెంగళూరులో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 5.30కి విజయవాడ చేరుకుంటుంది. విశాఖపట్నానికి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకుంటుంది. కృష్ణరాజపురం, బంగారాపేట, జోలార్‌పేట, కడప, రేణుగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో ఆగుతుంది.

బందరులో విగ్రహాల రగడ

● ఎన్టీఆర్ విగ్రహం నెలకొల్పాలని టీడీపీ నేతల ధర్నా
● వాజ్‌పేయి విగ్రహ శంకుస్థాపనకు పట్టుబట్టిన బీజేపీ నేతలు
● ఓర్పుగా ఉండాలని టీడీపీ నేతలకు మంత్రి కొల్లు రవీంద్ర హితవు



ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మోహరించిన టీడీపీ, బీజేపీ నేతలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మచిలీపట్నం ఎన్టీఆర్ సర్కిల్‌లో సోమవారం ఉదయం వాజ్‌పేయి విగ్రహానికి శంకుస్థాపన చేస్తామంటూ బీజేపీ నేతలు రంగంలోకి దిగారు. దీంతో ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం నెలకొల్పాలంటూ టీడీపీ నేతలు మూతికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శనతో సర్కిల్‌లో బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీంతో టీడీపీ, బీజేపీ నేతల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం చోటు చేసుకుని ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగంలోకి దిగి ఇరకాటంలో పడ్డారు. టీడీపీ పక్షాన అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు ఐ దిలీప్, మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు, బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్, సాతులూరి నాంచారయ్య, పిప్పళ్ల కాంతారావు, వేమూరి బాలు, ఎండీ ఇలియాస్‌పాషా, కట్టా అంజిబాబు, సలీం, బోలెం హరిబాబు, మెట్టు సూరిబాబు, జనసేన నేత వంపుగడల చౌదరి ధర్నాలో పాల్గొన్నారు. కాగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరాం, మాజీ అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, ముడా మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, నేతలు సోడిశెట్టి బాలాజీ, పంతం గజేంద్ర, కూనపరెడ్డి శ్రీనివాసరావు, అయోధ్య రామయ్య, వై పాండురంగారావు, గాజుల సిద్ధార్థ, ఘంటా సతీష్, బొడ్డు సునీల్, అభినందన, హరికృష్ణ, బొమ్మిడి గణేష్ పాల్గొన్నారు. చిలకలపూడి సీఐ నబీ, ఆర్‌పేట సీఐ సాయిబాబు, ఇనకుదురుపేట సీఐ పరమేశ్వరరావు పోలీసు బలగాలతో రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సందర్భంగా దిలీప్ కుమార్, బత్తిన దాసు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులోని సెంటర్‌కు ఎన్టీఆర్ సర్కిల్ పేరు పెట్టామని, ఎన్టీఆర్ విగ్రహం స్థాపించాలని అర్బన్‌బ్యాంక్ అధ్యక్షుడు ఐ దిలీప్ కుమార్, మాజీ కౌన్సిలర్ బత్తినదాసు డిమాండ్ చేశారు. కలెక్టర్ నుంచి ఎన్టీఆర్ విగ్రహానికి అనుమతులు లేవని, అందుకే మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహం నిర్మించి తీరుతామంటూ బీజేపీ నేతలు నినాదాలు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి అందర్నీ పంపేశారు. అయితే ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద మంత్రి కొల్లు రవీంద్ర టీడీపీ నేతలతో విగ్రహాల ప్రతిష్ఠపై చర్చించారు. అందరూ కలిసి పనిచేయాలని విగ్రహాల స్థాపనలో రగడ చేయవద్దని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో మాట్లాడి సముచిత నిర్ణయం తీసుకుంటామని మంత్రి టీడీపీ నేతలను బుజ్జగించారు. అనంతరం మాధవ్‌తో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కూటమి నేతలంతా కలిసి ఉన్నందున త్వరలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పడంతో వ్యవహారం సర్దుమణిగింది.

అర్జీల సత్వర పరిష్కారంపై దృష్టి సారించండి

● ఇన్‌-చార్జి కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 162 అర్జీలు అందాయని ఇన్‌చార్జి కలెక్టర్ ఇలక్కియా చెప్పారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో జాప్యం వుండరాదన్నారు. అర్జీదారుకు సత్వర, సంతృప్తికర పరిష్కారం లభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహం, జెడ్‌పీ సీఈఓ కన్నమనాయుడు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

అయ్యప్పస్వామి దేవాలయానికి రూ.50,116 విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపులపాడు శివాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న అయ్యప్పస్వామి దేవాలయానికి సోమవారం స్థానిక శ్రవంతి చారిబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ రూ. 50,116లు విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులు గూడ పాటి రత్నశేఖర్, కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, కొల్లి వెంకట్రావు, వీర మాచనేని నాగయ్య, రాంబాబు దాతను అభినందించారు.





చెరుకు లోడింగ్ వద్ద పూజ నిర్వహిస్తున్న కే సీపీ డీజీఎం(కేన్) వెంకటేశ్వర్లు

చెరుకు లోడింగ్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుకు వివిధ రకాల ప్రోత్సాహ కాలనందిస్తూ చెరుకు సాగు విస్తీర్ణం పెంపొందించేలా చర్య లు చేపట్టినట్లు సద్వినియోగం చేసుకుని మరింత ఎక్కువగా చెరుకు సాగు చేయాలని కేసీపీ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్.ఎన్.పాలెంలో జాతీయ రహదారి పక్కన చెరు కు లోడింగ్ పాయింట్ వద్ద సోమవారం రైతులతో కలిసి పూజ చేసి లోడింగ్‌ను ప్రారంభించారు. బాపులపాడు మండలం నుంచి 76 వేల మెట్రిక్ టన్నుల చెరుకును ఫ్యాక్టరీకి తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ మేనేజర్ వి.కాశినాయుడు వివరించారు.

బాలోత్సవ్‌కు మానవత విరాళం

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో నిర్వహించనున్న హేలాపురి బాలోత్సవ్ కార్యక్రమానికి మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సభ్యులు రూ.46,500లు విరాళం అందజేశారు. సోమవారం మానవత కార్యాలయంలో బాలోత్సవం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావుకు విరాళం అందజేశారు. ఈ నెల 12 నుంచి 14వరకు ఏలూరులో జరగనున్న బాలోత్సవానికి విరాళం అందజేశారు. మారుబోయిన కోటేశ్వరరావు రూ.30వేలు, మానత సభ్యులు ఘంటా సత్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, లలితాకామేశ్వరి, కూరెళ్ల సుబ్బాచారి, నారగాని కొండలరావు జి. జయరామచంద్రరావు తదితరులు కలిపి మరో రూ.16,500లు విరాళం అందజేసినట్లు మానవత జంక్షన్ శాఖ అధ్యక్షుడు బాణాల నరసింహారావు తెలిపారు. కార్యక్రమంలో రత్నాకరరావు, సత్యనారాయణ, సుబ్బారావు, సూర్యనారాయణ, శ్రీరామ్‌మూర్తి, కొండలరావు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న జంపాన, సభ్యులు

అవినీతిపై విచారణ జరిపించాలి

ఉయ్యూరు చైర్మన్, కమిషనర్‌పై మంత్రి నారాయణకు వినతి

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు మున్సిపాలిటీలో చైర్మన్, కమిషనర్ అవినీతిపై విజిలెన్స్ విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ మంత్రి పి. నారాయణకు వినతిపత్రం సమర్పించినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. యుఎఫ్ ఆర్‌టీఐ సభ్యుల బృందం సోమవారం మంత్రిని సచివాలయంలో కలసి మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అవినీతిపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మున్సి పాలిటీలో మోటార్లు వైండింగ్ నిమిత్తం మరమ్మతులు చేయకుండానే లక్షల రూపాయలు ఖర్చు చేసినట్టు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయ డానికి, బ్లీచింగ్ నిమిత్తం లక్షల రూపాయలు, తాగునీరు శుభ్రపరిచేం దుకు అవసరమైన లిక్విడ్ క్లోరినేషన్ చేయకుండా బిల్లులు పెట్టి పెద్దయెత్తున అవినీతికి పాల్పడి ప్రజాధనం దిగమింగారని ఆరోపిస్తూ చైర్మన్, కమిషనర్ అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని మంత్రికి సమర్పించిన వినతిపత్రంలో పేర్కొన్నట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్ల నిర్వహణ చేపట్టి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు ఎస్సీ కాలనీలో తాగు నీరు కలుషితం అయినట్టు సమాచారం మేర సోమవారం గ్రామంలో పర్యటించి పైపులైన్ డమ్మీలు తొలగింప చేయించి నీటిని వదిలి పెట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ, తాగునీరు సరఫరాపై శ్రద్ధ వహించాలన్నారు. సర్పంచ్ లింగాల భాస్కర్, కోయ ఆనందప్రసాద్, ధనకోటేశ్వరరావు పాల్గొన్నారు.

● పెనమలూరులో ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, రికార్డులు తనిఖీచేసి, ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కోయ ఆనందప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు ఎమ్మెల్యేతో ఉన్నారు.



పెనమలూరులో వాటర్ పైప్‌లైన్ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఉంగుటూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యువత వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా వుంటూ ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని నారయ్యఅప్పారావుపేట సర్పంచ్ నాగరాజు అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వారంరోజులపాటు నిర్వహించే ప్రత్యేక సేవా శిబిరం ఈ సంవత్సరం పొట్టిపాడు శివారు నారయ్య అప్పారావుపేటలో సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు శిబిరంలో భాగంగా ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు యాంటీ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు యువత, ఎన్‌ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్నిపెంపొందించేలా చేయూతనివ్వడం అభినందనీయమని ఏపీఆర్డీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ అన్నారు. పెరికీడుకు చెందిన మానసిక దివ్యాంగురాలు దయాన కుటుంబానికి రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అందజేసిన నిత్యా వసరా లను ఆయన సోమవారం పంపిణీ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగురాలి కుటుంబానికి తన వంతు సహకారంగా నెలకు సరిపడా నిత్యావసరాలు(రూ.10 వేలు విలువ గల) అందజేసినట్లు సాంబశివరాయల్ వివరించారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు ప్రవీణ్, అంబల్ల వెంకటరంగారావు, సింగవరపు దుర్గారావు, బట్టు రత్న పాల్గొన్నారు.

60 మందికి నేత్రపరీక్షలు

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు టూవీలర్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్యశిబిరం నిర్వహించి 60 మందికి నేత్ర పరీక్షలు చేశారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అక్బర్‌బాషా పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో ఆప్తమాలజిస్ట్ ఏ.రాకేశ్ నేత్ర పరీక్షలు చేశారు. యూనియన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో సాధారణ దృష్టి పరీక్షలు చేసి నేత్ర సంరక్షణ అంశంపై సూచనలు సలహాలు అందించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.నాగరాజు, అధ్యక్షుడు ఎం. జగన్నాథం, ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ, సెక్రటరీ అబ్దుల్ ఇబ్రహీం, కోశాధికారి కొల్లా వేణు, ప్రచార కార్యదర్శి ఎం. విజయ్ పాల్గొని సేవలందించారు.

వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవం

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కోడె సాంబశివరావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడుగా టి. చంటిబాబు, కార్యదర్శి గోకా శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఖలీల్ ఎన్నికైనారు. అసోసియేషన్‌కు రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన సాంబశివరావుకు డాక్టర్ తిరుమలరావు, రాంబాబు, రమణ, అంగడాల బుజ్జి, రాము తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సహకార సంఘాల ఉద్యోగుల నిరసన

గన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండపల్లి బాలాజీ డిమాండ్ చేశారు. ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్(జేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కేడీసీసీ బ్యాంక్ ఎదుట సహకార సంఘాల ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఆర్. రాంబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి గుండపనేని కృష్ణవేణి, కన్వీనర్ సజ్జ నాగబాబు, నండూరి శ్రీనివాసరావు ఉద్యోగులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించి డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉయ్యూరు కేడీసీసీ బ్యాంకు బ్రాంచి పరిధి సంఘాల ఉద్యోగులు సోమవారం విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. **ఉంగుటూరు :** మండలంలోని 11 సహకార సంఘాల (పీఏసీఎస్‌లు) ఉద్యోగులు సోమవారం కేడీసీసీ బ్యాంక్ తేలప్రోలు, ఉంగుటూరు బ్రాంచ్‌ల ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక (జేఏసీ) పిలుపు మేరకు కృష్ణాజిల్లా సహకార సంఘాల యూనియన్ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌ల ఉద్యోగులు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ కేడీసీసీ బ్రాంచ్‌ల ఎదుట నిరసన చేపట్టారు. యూనియన్ నాయకులు షేక్ కాలీషా, గర్రే లోకేశ్వరరావు సహకార సంఘాల సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్‌రూరల్:** దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సహకార సంఘ ఉద్యోగుల చేపట్టిన ఆందోళన కార్యక్రమం ఉధృతం చేశారు. బాపుల పాడు మండల వ్యాప్తంగా గల పీఏసీఎస్ ఉద్యోగులు జిల్లా కార్యదర్శి వీరపనేని రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కేడీసీసీ బ్యాంకు హనుమాన్‌జంక్షన్ శాఖ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా గల పీఏసీఎస్ ఉద్యోగులు, ఆర్గనైజర్ వడ్డి సుమన్, వివిధ సంఘాల కార్యదర్శులు రాము, చలపతి, రామారావు, శ్రీనివాసరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

కంకిపాడు : సొసైటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కో ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కంకిపాడు సొసైటీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ బ్యాంక్ మేనే జర్ సీ.హెచ్ జాహ్నవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దీక్షతులు, ప్రవీణ్, ఎ. వెంకటప్పారెడ్డి, జితేంద్ర, పి. ఇందిర, వై. శ్యామల, యామిని పాల్గొన్నారు.



జంక్షన్ కేడీసీసీ బ్యాంకు బ్రాంచి వద్ద ఉద్యోగుల నిరసన



కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

కేసరపల్లి పంచాయతీకి ఐఎస్‌వో గుర్తింపు

గన్నవరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి పంచాయతీకి ఐఎస్‌వో గుర్తింపు లభించింది. గ్రామపంచాయతీ నిర్వహణ, కాఫీ షాప్ ఏర్పాటుపై ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను మంజూరు చేయగా సోమవారం కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి సీహెచ్ వివిఎల్ ప్రసాద్ అందుకున్నారు. పంచాయితీకి ఆదాయాన్ని మరింత పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, హెచ్‌సీఎల్ సమీపంలో రూ.7లక్షలతో పంచాయతీకి ఆదాయం చేకూరేలా కాఫీ షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెలకు సుమారు రూ.50 వేలు వరకూ ఆదాయం వస్తుందన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో ఒత్తిడి తగ్గించి శ్రద్ధగా చదువుకునేలా ఆరోగ్యాన్ని కాపాడేందుకు స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందిస్తున్నా మని, దాతలు సహకరించడం అభినందనీయమని హెచ్ఎం లూథర్‌పాల్ అన్నారు. రేమల్లె హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు అవసరమైన అల్పాహారాన్ని యనమదల సుధాకర్ సోమవారం హెచ్ఎంకు అందజేశారు. 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు.



శ్రీప్రతిభ కోచింగ్ సెంటర్ విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, చిత్రంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

చంద్రబాబు అంటేనే డీఎస్సీ

● శ్రీప్రతిభ కోచింగ్ సెంటరు విజయోత్సవ సభలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ

పెనమలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్షలాది ప్రభుత్వ ఉపాధ్యాయుల నియామకాలకు కారణమైన డీఎస్సీ అంటే చంద్రబాబు అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. శ్రీప్రతిభ నుంచి రికార్డు స్థాయిలో 358మంది విద్యార్థులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన సందర్భంగా ఆదివారం కానూరు శ్రీప్రతిభ కోచింగ్ సెంటరులో ఏర్పాటు చేసిన డీఎస్సీ విజయోత్సవ సభలో కొనకళ్ల మాట్లాడారు. ఇటీవలి ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యారంగం పట్ల తమకున్న ప్రత్యేక బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చెప్పకనే చెప్పారని కొనియాడారు. కోచింగ్ సెంటర్ అధినేత జంపాన సుధాకర్ మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధ విద్యాబోధన, పటిష్టమైన షెడ్యూల్, అనుభవం గల ఉపాధ్యాయుల బోధన వల్లే అద్భుత ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రతియేటా డీఎస్సీని ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రికార్డు స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు సాధింపజేసిన శ్రీప్రతిభ కోచింగ్ సెంటరు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, గొట్టిముక్కల రఘురామరాజు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్, కుడిపూడి సత్తిబాబు, మల్లెల ఈశ్వరరావు, ఏఎస్ రామారావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, పేరేపి ఈశ్వర్, ఏ మణి పాల్గొన్నారు.

గ్రామాల్లో సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్యం, విద్య, అన్నవితరణ లాంటి సేవలతో పాటు పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటి సేవలందించడం అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు అన్నారు. హనుమాన్ జంక్షన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 2024-25 సేవలకు గాను సేవాపుర స్కారాలను మాజీగవర్నర్ గద్దె శేషగిరి ఆదివారం సాయంత్రం అందజేశారు. విజయవాడలోని అన్నేవారి కల్యాణ మండపంలో నిర్వహించిన స్పందన పురస్కారాల వేడుకలో హనుమాన్‌జంక్షన్ లయన్స్‌క్లబ్ సభ్యులను పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆళ్ల గోపాలకృష్ణ, అక్కినేని శ్రీనివాసఫణీంద్ర, కళ్లేపల్లి నారాయణరావు, తమిరి రమేష్, పంచకర్ల రమేష్‌చక్రవర్తి, కోశాధికారి రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీఓ ఉయ్యూరు యూనిట్ ఎన్నికలు 23న

ఉయ్యూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీఎన్‌జీఓ ఉయ్యూరు తాలూకా యూనిట్ కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 23న నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి కేపీ రావు తెలిపారు. 10 తేదీ ఉదయం 10 గంటల నుంచి స్థానిక ఏపీఎన్‌జీఓ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా జి.రాజేంద్ర, అబ్జర్వర్‌గా కేవీ కోటేశ్వరరావు వ్యవహరిం చనున్నారని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు ఎన్నికల్లో పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670



విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

పామర్రు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బల్లిపర్రు ఎస్సీ కాలనీలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతిచెందాడు. చెన్నువానిపురానికి చెందిన చిన్నం విజయబాబు (51) బల్లిపర్రు ఎస్సీకాలనీలో విద్యుత్ స్తంభం ఎక్కి ఇంటి సర్వీసు వైరు సరి చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందాడు. దీంతో చెన్నువానిపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంపీపీ దాసరి అశోక్ కుమార్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



రామబ్రహ్మం చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, కుమార్‌రాజా

చలసాని రామబ్రహ్మం చౌదరికి ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు వెనిగండ్ల, వర్ల నివాళి

పామర్రు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన సినీ నిర్మాత చలసాని రామబ్రహ్మం చౌదరి భౌతికకాయానికి స్వగ్రామం పెదమద్దాలి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. సోమవారం చౌదరి దశ దిన కర్మను పురస్కరించుకుని జరిగిన సంతాప సభలో చౌదరి స్నేహితుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా పాల్గొన్నారు. రామబ్రహ్మం చౌదరి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న ఎంఈవో రజిని

ఎంఈవో రజిని మధ్యాహ్న భోజనం పరిశీలన

గుడివాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం నాణ్యతతో పెట్టాలని ఎంఈవో రజిని ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని నిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కుంపటివానిగూడెం పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో భానుప్రకాష్

ఎంఈవో భానుప్రకాష్ పాఠశాలల తనిఖీ

కూచిపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని కుంపటివానిగూడెం ప్రాథమిక పాఠశాల, పెదముత్తేవి జడ్పీ పాఠశాలలను ఎంఈవో -1 భానుప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయి? ఉత్తమ ఫలితా సాధన కోసం తీసుకోవాల్సిన చర్యలు, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి విషయాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.



అవార్డులు అందుకొన్న గుడ్లవల్లేరు లయన్స్ ప్రతినిధులు

గుడ్లవల్లేరు లయన్స్‌కు సిల్వర్ క్లబ్ అవార్డు

గుడ్లవల్లేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు లయన్స్ 2024-25 సంవత్సరంలో నిర్వహించిన సేవాకార్యక్రమాలకు జిల్లా లయన్స్ గవర్నర్ నుంచి పలు అవార్డులు సొంతం చేసుకొంది. తృతీయ ఉత్తమ క్లబ్ అవార్డు, సిల్వర్ క్లబ్ అవార్డు సాధించింది. వైపిసి ప్రసాద్‌ను లైఫ్‌టైమ్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించారు. ఇన్నోవేషన్ ప్రెసిడెంట్ అవార్డును నిమ్మగడ్డ శశికళ అందుకున్నారు. అవుట్ స్టాండింగ్ సెక్రటరిగా మేరుగు పెరుమాళ్లరావు, ఔట్ స్టాండింగ్ ట్రెజరర్‌గా కళ్యాణపు నవాబు అవార్డులు పొందారు. గుత్తికొండ సుభాష్‌చంద్రబోస్, పి.ఎన్.విజయ్‌బాబు అప్రిషియేషన్ అవార్డులు అందుకొన్నారు. విజన్ ఐకేర్, రిలీవింగ్ హంగర్, యోగా బిబిరాల నిర్వహణకు ఉత్తమ అవార్డులను మాజీ గవర్నర్ గద్దె శేషగిరి అందజేశారు.

పాత మున్సిపల్ కార్యాలయం వద్ద రాత్రికి రాత్రే బడ్డీతో ఆక్రమణ !



గుడివాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆక్రమణల పర్వం మొదలైంది. కైకాల సత్యనారాయణ విగ్రహం పక్కనే ఇప్పటికే మూడు కార్లు పార్కు చేసి వెళ్లిపోయారు. కైకాల సత్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించేందుకు వీలు లేకుండా కారును అడ్డంగా పార్కు చేశారు.. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద బడ్డీ కొట్టును పెట్టేశారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని దుకాణాలు, కార్యాలయంలో 22, 30, 31 వార్డు సచివాలయాలకు వచ్చే వారు తమ వాహనాల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వినియోగిస్తుంటారు. ఆక్రమణలను వెంటనే తొలగిస్తామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పేర్కొన్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని భవిష్యత్ భద్రతాదళం వ్యవస్థాపకులు వై.వి.మురళీకృష్ణ కోరారు.

స్వచ్ఛరథం సేవలను వినియోగించుకోవాలి

గుడ్లవల్లేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛరథం పథకాన్ని ప్రజలు మరింత సమర్థంగా వినియోగించుకోవాలని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారను. స్వచ్ఛరథం సేవలను ఇప్పటికే మండలంలో బాగానే వినియోగిస్తున్నారన్నారు. అంగలూరులో స్వచ్ఛరథాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజల నుంచి ఏవిధమైన వ్యర్థాలను సేకరిస్తున్నదీ, ప్రజలకు నిత్యావసర సరకులు ఏవిధంగా ఇస్తున్నది ప్రజలను ఇమ్రాన్ అడిగి తెలుసుకొన్నారు. రికార్డులను ఆయన పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కలిగించాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో సోమవారం నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వెనిగండ్ల మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. అనారోగ్యం కలిగితే ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. పీహెచ్‌సీల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోటూరు, రామాపురం, రుద్రపాక, గుడ్లవల్లేరు, కౌతవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ బి.శ్రావ్య, డాక్టర్ మాధవి, డాక్టర్ దీప్తి, డాక్టర్ మంజూష, డాక్టర్ సిహెచ్ సాయికిరణ్, డాక్టర్ తేజ, వైద్యులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న డాక్టర్ యశస్విని

ఇందిరా కాలనీలో వైద్యాధికారుల పర్యటన

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇందిరా కాలనీలో స్క్రబ్ టైఫస్ వైరస్ బారిన పడిన ఇద్దరిని మండల అధికారులు, వైద్య బృందం ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారితో గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ యశస్విని మాట్లాడారు. పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొన్నారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుగానే ఉందన్నారు. డాక్టర్ యశస్విని మాట్లాడుతూ ఇద్దరి ఆరోగ్యం విషయమై ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. ప్రజలు ఈ వైరస్ బారిన పడకుండా ఉండాలంటే ముఖ్యంగా ఇంటి లోపలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం, ఎంపీడీవో ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణనగర్‌లో డాక్టర్ దీప్తి అవగాహన



గుడివాడ రూరల్ : గుడివాడ మండలంలో స్క్రబ్ టైఫస్ కేసులు ఏమీ నమోదు కాలేదని డాక్టర్ దీప్తి అన్నారు. మల్లాయిపాలెం పరిధిలో ఉన్న బాలకృష్ణనగర్ తదితర ప్రాంతాలను సోమవారం స్క్రబ్ టైఫస్‌పై అవగాహన కల్పించారు. పురుగు వల్ల ఈ వ్యాధి సోకుతుందని, దద్దుర్లు ఉం టాయని తెలిపారు. ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అనారోగ్యంగా ఉంటే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు.



సమస్యల పరిష్కారం కోరుతూ గుడివాడ, మొవ్వ, గుడ్లవల్లేరులో ప్లకార్డుల ప్రదర్శిస్తూ, ధర్నా చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు

సమస్యలపై నినదించిన సహకార ఉద్యోగులు

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సహకార ఉద్యోగులు డివిజన్‌లోని పీఏసీఎస్‌లు, సహకార బ్యాంకుల వద్ద ధర్నా నిర్వహించారు. తక్షణమే జీవో నెం.36ను అమలు చేయాలని, వేతన సవరణలు చేపట్టాలని, రిటైర్మెంట్ వయస్సు 62సంవత్సరాలకు పెంచాలని రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జేఏసీ అధ్యక్షుడు టి.పి.ఎస్ హనుమంతరావు డిమాండ్ చేశారు. నీలామహల్ రోడ్డులోని సహకార కేంద్ర బ్యాంకు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు రమేష్, కార్యదర్శులు హరీష్, సుజాత, ఆశ పాల్గొన్నారు. **కూచిపూడి :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొవ్వ మండలంలో పని చేస్తున్న పీఏసీఎస్ ఉద్యోగులు సోమవారం మొవ్వ కేడీసీసీ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించి, మేనేజర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ సంఘాల నేతలు జె.వి.సత్యనారాయణ, పివి.రమణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పిఏసిఎస్) ఉద్యోగులు సోమవారం విధులను బహిష్కరించి గుడ్లవల్లేరు కేడీసీసీ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. పీఏసీఎస్ రాష్ట్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి పుల్లేటి నాగమల్లేశ్వరరావు, బ్రాంచ్ మైజర్ రాజనాల ఆంజనేయులు, పీఏసీఎస్‌ల సీఈవోలు అన్నం గిరిధర్ కుమార్, జన్ను భరత్ కుమార్, అర్జా వీరవెంకట సురేష్,తోట నాగవెంకట ఉషారాణి, ఉద్యోగులు పాల్గొన్నారు. **పామర్రు :** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పామర్రు కేడీసీసీ బ్యాంకు వద్ద సహకార బ్యాంకు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజరు కోమలికుమారికి అందజేశారు మండల సహకార పరపతి సంఘాల కార్యదర్శులు తోలేటి రవిసత్యప్రసాద్, ఎలిశెట్టి వీరాంజనేయులు, ఎ.వి.ఆర్‌కె ప్రసాద్, శ్రీనివాసరావు, రవితేజతదితర్లు పాల్గొన్నారు.



పామర్రులో వినితిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఈ-క్రాప్ నమోదు చేయాలని వినతి

కూచిపూడి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అధికారు ల అలసత్వం వల్ల మొవ్వ మండలంలో ఈ-క్రాప్ నమోదు సరిగా జరగకపోవటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మొవ్వ మండల శాఖ నేతలు జోగి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. మొవ్వ తహసీల్దార్ మస్తాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ-క్రాప్ నమోదు కానీ రైతుల పేర్లను స్పెషల్ డ్రైవ్ ద్వారా తక్షణం నమోదు చేయాలన్నారు. వరుస తుఫాన్‌ల వల్ల రైతులు అతలాకుతమవుతున్నారనానరు. ధాన్యానికి గిట్టుబాటు ధర లే కపోవటం, మిల్లర్లు సకాలంలో ధాన్యాన్ని తరలించక పోవటం, రైతు సేవా కేంద్రం అధికారులు, సిబ్బంది రైతులకు సరైన సేవలు అందించకపోవటం వల్ల రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని వినతిపత్రంలో కోరారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ

అవనిగడ్డ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. రాష్ట్ర కమిటీ రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణలు కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు, యుటీఎఫ్ ఆఫీస్ మేనేజర్ మూర్తి, శిరీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనకరావు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన నాగసాయి, కె.సంజనను అభినందిస్తున్న పాలకవర్గం

కృష్ణాతరంగ్‌లో ఏఎన్ఆర్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్శిటీలో నిర్వహించిన కృష్ణాతరంగ్ యూత్ ఫెస్టివల్‌లో ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటారని కళాశాల పాలకవర్గ అధ్యక్ష ,కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను వారు అభినందించారు. పెయింటింగ్ పోటీల్లో ఎస్.నాగసాయి ద్వితీయ, ఇన్‌స్ట్రుమెంటల్ సోలో పోటీల్లో కె.సంజన ద్వితీయ బహుమతి సాధించారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, కళాపీఠం కన్వీనర్ డా.డి.ఎన్ ప్రత్యూష, సభ్యులు సువర్ణలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

20 మందికి సీఎం సాయం చెక్కులు

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో ఉన్న ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రజావేదికలో 20 మంది బాధితులకు మంజూరైన రూ.10.05 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కూటమి నాయకులు దింట్యాల రాంబాబు, ముళ్ళపూడిరమేష్, కర్రె వెంకటగిరి, పొట్లూరి కృష్ణారావు, పోలాసి ఉమా, కంచర్ల సుధాకర్, రామదేణు వేణుబాబు, నిమ్మగడ్డ సత్యసాయి, సందు పవన్, కొదమల గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

పైపు లీకేజీ, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించండి

మంచినీటిపైపు లీకేజీ, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు. పెద ఎరుకపాడులోని హెడ్ వాటర్ వర్క్సులోని 12 ఎం.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. పందిళ్ళ మల్లి, గూడపాటి రాజు, కటికల కళ్యాణ్ తదితరులున్నారు.



పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఆత్మశుద్ధికి దీక్షలు దోహదం : ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఆత్మశుద్ధికి భగవంతుని దీక్షలు తోడ్పాడతాయని, సర్వమాలధారులు ఈ ఏడాది తమ దీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని, స్వామివారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. బంటుమిల్లి రోడ్డులోని స్వామి అయ్యప్ప దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం నిర్వహించారు. పడిపూజలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెనిగండ్లను దేవస్థానం కమిటీ పెద్దలు ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించారు. టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, అయ్యప్ప దేవస్థానం కమిటీ పెద్దలు కొత్త వీరయ్య, తాళ్ళూరి సుబ్బారావు, గంటా ఆనందబాబు, కొల్లిపర సాయి, యక్కలిమణిదీప్, తుంపూడి సాంబశివరావు, బుజ్జి, రమణ, గోపి, రామచంద్రరావు, భారీ సంఖ్యలో దీక్షాపరులు పాల్గొన్నారు.



సంతోషకర వేడుక సెమీ క్రిస్మస్

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సెమీ క్రిస్మస్ వేడుకలు సంతోషానికి ప్రతిరూపమని, సర్వజనులపై క్రీస్తు దేవుని కరుణాకటాక్షాలు ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గుడ్‌మెన్‌పేటలో జాకబ్ మెమోరియల్ చర్చెస్, పాస్టర్ విజయ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. క్యాండిల్ సర్వ్ చేసి కేక్‌ను కట్ చేశారు. క్రైస్తవ సోదరులందరూ క్రిస్మస్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు కె.ఎలీజా, రత్నాకర్, రాజు, ఎలీషా, టీడీపీ నాయకులు చేకూ రు జగన్మోహనరావు, వేశపోగు ఇమ్మానియేలు, గూడూరు సురేంద్ర, యేసేబు, చిన్న, నితీష్, రవీంద్ర, సాల్మన్ విశ్వాసులు పాల్గొన్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి గూడ్స్ రవాణా వాహనాల నిలిపివేత

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చలానా ధరలను విపరీతంగా పెం చినందున, రాష్ట్ర ప్రభుత్వం టెస్టింగ్ ఫీజులను, సర్టిఫికెట్ ఫీజులను యధాతథంగా గూడ్స్ వాహన యజమానులకు ఉపశమనం కల్పించాలని కోరుతూ ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి గూడ్స్ రవాణా వాహనాలు నిలపుదల చేస్తున్నట్లు ది లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ విపరీతంగా పెంచడంతో లారీ ఓనర్లు ఇబ్బందులు పడ్డారన్నారు. ఎఫ్‌సీ చలానా రేట్‌లను విపరీతంగా పెంచడంతో లారీలను తిప్పడం ఇబ్బందికరంగా మారిందని అడుసుమిల్లి శ్రీనివాస్ తెలిపారు.

ఇంద్ర బస్సు చార్జీ తగ్గింపు

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ - హైదరాబాద్ ఇంద్ర ఏసీ ఆర్‌టీసీ బస్సు సర్వీస్‌లలో ఈనెల 9వ తేదీ నుంచి ఈనెల 31వ తేదీ వరకు (ఆదివారం గుడివాడ, శుక్రవారం హైదరాబాదు నుంచి మినహాయించి) చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు గుడివాడ డిపో మేనేజర్ ఎస్.సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు రాత్రి 10 గంటలకు గుడివాడ నుంచి, బీహెచ్‌ఈఎల్ నుంచి రాత్రి 8.40గంటలకు బయలు దేరుతుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. **అవనిగడ్డ :** నాగాయలంక నుంచి అవనిగడ్డ, పామర్రు మీదుగా నడిపే బీహెచ్‌ఈఎల్ ఇంద్ర సర్వీసు చార్జీలు 30వ తేదీ వరకు తగ్గించినట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌చార్జీలో 10 శాతం తగ్గించటం జరిగిందన్నారు. రూ.910 చార్జీని రూ.830లకు తగ్గించామన్నారు. అవనిగడ్డ నుంచి బీహెచ్‌ఈఎల్‌కు రూ.890ల నుంచి రూ.820 తగ్గుతుందని తెలిపారు.

వైభవంగా లక్ష్మీగణపతి హోమం

గుడివాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెయిన్ రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో సంకటహర చతుర్థి సందర్భంగా దేవస్థాన మండపంలో శ్రీలక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించారు. 100 మంది జంటలు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. దేవస్థానం పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భక్తులు దాతలు, తమ వంతు అందించాలని ధర్మకర్తల మండలి ఛైర్మన్ సాయన రాజేష్ కోరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు), కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మీ, శారద, దుర్గా భవాని, గణపతిశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

ఎరుకపాడు ఆలయంలో..

గుడివాడ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎరుకపాడులోని అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా వినాయక స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.